

ఇద్దరు కూతుళ్లతో మౌనిక, బాజీ (ఫైల్)

ఘొల్లుమన్న నిదానపురం

- ఇద్దరు పిల్లలకు ఉరివేసి తల్లి ఆత్మహత్య
- దొంగతనాలకు పాల్పడుతూ పోలీసులకు చిక్కిన భర్త
- తనను మోసం చేశాడనే వ్యథతో భార్య తీవ్ర నిర్ణయం
- ఆరేళ్ల క్రితం మతాంతర వివాహం

మధిర రూరల్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులను ఎదిరించి, మతాంతర ప్రేమవివాహం చేసుకున్న ఆమె, భర్త తీరుతో తీవ్ర మనస్తాపానికి లోనైంది.. అటు పుట్టింటి వారి అండ లేక, ఇటు భర్త ప్రవర్తన సరిగా లేక జీవితంపై విరక్తి చెందింది.. చివరకు తన ఇద్దరు పిల్లలకు ఉరివేసి, తానూ ఉరివేసుకొని తనువు చాలించింది. ఈ విషాదకర సంఘటన ఖమ్మం జిల్లా మధిర మండలంలోని నిదానపురంలో గురువారం జరిగింది.

నిదానపురం గ్రామానికి చెందిన షేక్ బాజీది వ్యవసాయ కుటుంబం. ఉన్న కొద్దిపాటి పొలాన్ని సాగు చేస్తూ, తల్లిదండ్రులు కూలిపనులకు వెళ్లేవారు. డిగ్రీ చదివిన బాజీ.. ఆరేళ్ల క్రితం పోటీ పరీక్షలకు శిక్షణ పొందేందుకు విజయవాడకు రైలులో వెళ్తుండగా, హైదరాబాద్‌కు చెందిన మౌనిక(31) పరిచయమైంది. ఆమె కూడా పోటీ పరీక్షలకు వెళ్తున్నట్టు చెప్పింది. యాధృచ్ఛికంగా ఇద్దరూ ఒకే ఇన్‌స్టిట్యూట్‌లో చేరారు. మౌనిక తల్లిదండ్రులు ప్రభుత్వ లెక్చరర్లు వారి స్వస్థలం సూర్యాపేట కాగా, హైదరాబాద్‌లో స్థిరపడ్డారు. శిక్షణ సమయంలో ఇద్దరి పరిచయం ప్రేమగా మారింది. అనంతరం పెళ్లి (మిగతా 6వ పేజీలో)



బృందం సభ్యులకు వివరిస్తున్న ఖమ్మం ఎంపీ రఘురాంరెడ్డి



ఎయిర్‌పోర్టు స్థల మ్యాప్‌ను పరిశీలిస్తున్న కేంద్ర సర్వే బృందం



తొలి అడుగు

కొత్తగూడెంలో ఎయిర్‌పోర్టు సాధ్యాసాధ్యాలపై ఏఏఐ బృందం ఫీల్డ్ సర్వే

- క్షేత్రస్థాయిలో భౌగోళిక పరిస్థితులపై అంచనా
- కేంద్ర బృందంతో భద్రాద్రి జిల్లా యంత్రాంగం సమావేశం
- ఎయిర్‌పోర్టు ఆవశ్యకతపై పవర్‌పాయింట్ ప్రజంటేషన్
- కేంద్ర ప్రభుత్వానికి నివేదిక అందించనున్న బృందం
- త్వరలో మరో సాంకేతిక బృందంతో పూర్తిస్థాయి సర్వే

కొత్తగూడెం, జనవరి 23(ఆంధ్రజ్యోతి): కొత్తగూడెం ప్రాంతంలోని రామవరం, గరీబ్‌పేట గ్రామాల మధ్య ఎయిర్‌పోర్టు ప్రతిపాదిత స్థలాన్ని ఏఏఐ (ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా) సర్వే బృందం గురువారం పరిశీలించింది. కేంద్ర ప్రతినిధి బృందానికి భద్రాద్రి జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఖమ్మం ఎంపీ రఘురాంరెడ్డి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావులు స్వాగతం పలికారు.

సుజాతనగర్ మండల పరిధిలోని గరీబ్‌పేట, రామవరం ప్రాంతంలో ఉన్న 950 ఎకరాల స్థలాన్ని కేంద్ర ప్రతినిధి బృందం పరిశీలించింది. విమానాశ్రయ ప్రతిపాదిత స్థలంలో ఉన్న వనరులు, రహదారులు, గుట్టలను పరిశీలించారు. వ్యూ పాయింట్ ద్వారా మొత్తం స్థలాన్ని వీక్షించి ఫొటోలు తీసుకున్నారు. ఈ సర్వే బృందంలో ఏరోప్లానింగ్ ఇంజనీర్ అబ్దుల్ అజీజ్, ఆర్కిటెక్ట్ మహ్మద్ సబీం, ఆపరేషన్స్ ఇంజనీర్ ప్రశాంత్‌గుప్త, సీఎన్ఎస్ ఆర్.దివాకర్, ఇంజనీరు అధికారి సీ.మనీష్ జోన్వాల్, ఎఫ్‌డీ అధికారి ప్రవీణ్ ఉన్నికృష్ణన్ ఉన్నారు. ఈ బృందానికి భద్రాద్రి జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ విమానాశ్రయ ఏర్పాటు ప్రతిపాదనలకు సంబంధించిన వివరాలను తెలిపారు. మ్యాప్ ద్వారా స్థలం వివరాలను సభ్యులకు తెలియజేశారు. 950 ఎకరాల భూమిలో 20 నుంచి 30 శాతం పట్టా భూములు, 70 శాతం అటవీ భూములు ఉన్నాయని తెలిపారు.

స్థల పరిశీలన అనంతరం కొత్తగూడెం కలెక్టరేట్‌లో కేంద్ర ప్రతినిధి బృందంతో ఖమ్మం ఎంపీ రఘురాంరెడ్డి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, కలెక్టర్ జితేష్ వి పాటిల్ సమావేశమయ్యారు. ఈ సమావేశంలో జిల్లాకు సంబంధించిన అభివృద్ధి విషయాలు, ఎయిర్‌పోర్టు స్థలం, తదితర అంశాలపై పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా కేంద్ర ప్రతినిధి బృందానికి అవగాహన కల్పించారు. ఎయిర్‌పోర్టు ఏర్పాటు సాధ్యాసాధ్యాలపై అధ్యయనం చేసి సర్వే నివేదికను కేంద్ర బృందం త్వరలో కేంద్ర ప్రభుత్వానికి అందచేయనుంది. ఆ తర్వాత మరోసారి కేంద్రం నుంచి సాంకేతిక నిపుణుల బృందం కూడా క్షేత్రస్థాయి పరిశీలనకు రానుంది. ఈ సందర్భంగా ఏఏఐ ప్రతినిధి బృందం సభ్యులు మాట్లాడుతూ అన్ని జాతీయ, (మిగతా 6వ పేజీలో)

ఎయిర్‌పోర్టుతో అనేక ప్రయోజనాలు


ఎంపీ రఘురాంరెడ్డి



కొత్తగూడెం ఎయిర్‌పోర్టుతో అనేక ప్రయోజనాలు కలుగుతాయని, ఈ ప్రాంతంలో ఎయిర్‌పోర్టు నిర్మిస్తే అది ఏపీ, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలకు అనుసంధానంగా ఉంటుందని ఖమ్మం ఎంపీ రఘురాంరెడ్డి కేంద్ర సర్వే బృందం సభ్యులకు వివరించారు. ఎయిర్‌పోర్టుతో భద్రాద్రి దేవస్థానాన్ని సందర్శించేందుకు దేశంలోని వివిధ ప్రాంతాలనుంచి వచ్చే భక్తులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. హైదరాబాద్ నుంచి జిల్లాకు ప్రయాణం సాగించాలంటే ఆరుగంటల సమయం పడుతుందని విమానాశ్రయం ఏర్పాటు చేస్తే ప్రయాణభారం తగ్గుతుందన్నారు.

విమానాశ్రయంతో వాణిజ్యరంగ అభివృద్ధి

ఎమ్మెల్యే కూనంనేని



భద్రాద్రి జిల్లా అన్ని రంగాల్లో ముందంజలో ఉందని, విమానాశ్రయం ఏర్పాటుతో జిల్లా అభివృద్ధితో పాటు వాణిజ్య రంగం కూడా అభివృద్ధి చెందుతుందని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ఏఏఐ సభ్యులకు వివరించారు. హైదరాబాద్ తర్వాత అత్యధిక పరిశ్రమలు భద్రాద్రి జిల్లాలో ఉన్నాయన్నారు. జాతీయ, అంతర్జాతీయ, పారిశ్రామిక వేత్తల రాకపోకలకు, పర్యాటక రంగ అభివృద్ధికి ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు.

ప్రతీ ఒక్కరికి సంక్షేమ ఫలాలు

- రేషన్‌కార్డుల జారీ నిరంతర ప్రక్రియ
- పాలేరును ఆదర్శంగా తీర్చిదిద్దుతా
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

వివరాలు : 6లో



జల్లేపల్లిలో గ్రామసభలో మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి

'మంచు కురిసే వేళలో మల్లె విరిసేదెందుకో.. మల్లె విరిసే మంచులో మనసు మురిసేదెందుకో...' పాటను తలపిస్తూ సరికొత్త వాతావరణం అందరినీ మురిపిస్తోంది. తెల తెల వారుతుండగా చలి వణికిస్తుండగా, కనుచూపు మేర పరుచుకున్న మంచు తెరలు ప్రతీ ఒక్కరికీ కనువిందు చేస్తున్నాయి. పల్లే పట్నం తేడా లేకుండా గత కొన్ని రోజులుగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రతి రోజు తెల్లవారుజాము నుంచి ఉదయం ఎనిమిది గంటల వరకు ఈ వాతావరణం ఆవిష్కృతమవుతోంది. పొగమంచు మూలంగా దైనందిన జీవనానికి ఆటంకం కలుగుతున్నా, ఆ విభిన్న అనుభూతిని ఆస్వాదిస్తూనే జనం జీవనపోరాటం ఆరంభిస్తున్నారు. గురువారం ఉదయం 6.30 గంటలకు ఖమ్మం నగరాన్ని పొగమంచు కమ్మేసిన వేళ క్లిక్‌మనిపించిన దృశ్యం ఇది.

ఫొటో: స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఖమ్మం



లెక్క తేలుతోంది...

- బయటపడుతున్న 'రైతుబంధు' లొసుగులు
- ఇప్పటివరకు 6,359 ఎకరాలు వ్యవసాయేతరమని గుర్తింపు
- గ్రామసభల్లో ఇంకా దరఖాస్తు చేసుకుంటూనే ఉన్న జనం
- గత మూడు రోజుల్లో వచ్చిన దరఖాస్తులు 48,571
- ఇందిరమ్మ ఇళ్లకు 17,444, రేషన్‌కార్డులకు 17,088
- రైతుభరోసాకు 1,701, ఇందిరమ్మ ఆత్మీయ భరోసాకు 12,340
- నేటితో ముగియనున్న గ్రామసభల నిర్వహణ



వీఎంబంజర్‌లో ఘర్షణ పడుతున్న కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు

ఖమ్మం, జనవరి 23 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): జిల్లాలో గ్రామసభల్లో ప్రభుత్వ పథకాలకు సంబంధించి అర్హుల లెక్క పక్కాగా తేలుతోంది. గురువారం మూడో రోజు అక్కడక్కడ స్వల్ప సంఘటనలు మినహా సభలు ప్రశాంతంగా సాగాయి. దరఖాస్తుదారుల జాబితాలు లేనిచోట తిరిగి దరఖాస్తు చేసుకోవచ్చని అధికారులు చెప్పడంతో మళ్లీ ఇందిరమ్మ ఇళ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, తెల్ల రేషన్ కార్డుల కోసం పెద్దఎత్తున దరఖాస్తులు గ్రామసభల్లో అందుతున్నాయి.

ప్రభుత్వం ఈనెల 26 నుంచి అమలు చేయబోతున్న రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, తెల్లరేషన్ కార్డులకు సంబంధించి లబ్ధిదారుల ఎంపిక చివరిదశకు చేరింది. శుక్రవారంతో గ్రామసభలు ముగుస్తున్నందున శనివారం డేటా ఎంట్రీ 26న కొందరు లబ్ధిదారులకు అర్హత పత్రాల పంపిణీ చేసేందుకు అధికారులు సిద్ధం చేస్తున్నారు. గురువారం 157 చోట్ల గ్రామసభలు నిర్వహించారు. కాగా గత మూడురోజులుగా గ్రామసభల్లో పెద్దఎత్తున మళ్లీ దరఖాస్తులు చేస్తున్నారు. మూడు రోజులు సభల్లో మొత్తం 48,571 దరఖాస్తుదలు రాగా.. ఇందిరమ్మ ఇళ్ల 17,444, రేషన్‌కార్డులు 17,088, రైతు భరోసా 1,701, ఇందిరమ్మ ఆత్మీయభరోసాకు 12,340 వచ్చాయి

తేలిన రైతు భరోసా లెక్క

జిల్లాలో ఇప్పటివరకు రైతు భరోసాకు సంబంధించి అర్హులు, అనర్హుల లెక్క తేలింది. 5,060 మంది రైతులకు సంబంధించి ఇప్పటి వరకు 6,359 ఎకరాలు సాగులేని భూములుగా గుర్తించారు. రియల్ ఎస్టేట్ వెంచర్లు, ఫంక్షన్ హాల్స్, పెట్రోల్‌బంక్ స్థలాలు ప్రభుత్వం భూసేకరణ చేసిన భూములు, కాలువ భూములు, సాగుభూములుగా ధరణిలో ఉండడంతో ప్రతిఏటా రైతుబంధు ఎకరానికి రూ.10వేల వంతున అందుకున్నారు. జిల్లాలో 7,40,615 ఎకరాలకు 3,42,615 మంది రైతులు రైతుబంధు అందుకుంటూ వస్తున్నారు. ఇందులో ఇప్పుడు 6,359 ఎకరాలు అనర్హత గుర్తించారు. ఇప్పటివరకు ఏటా రూ.63కోట్ల వరకు ప్రభుత్వ సొమ్ము దుర్వినియోగం జరిగినట్టు తేలింది. జిల్లాలో 3,35,743 మంది రైతులకు సంబంధించి 7,34,756 ఎకరాలు సాగుభూమిగా ప్రాథమికంగా గుర్తించారు. శుక్రవారం కూడా కొంత మార్పులు జరిగే అవకాశం ఉంది.

ఇందిరమ్మ ఇళ్ల సర్వేలో కూడా పలుచోట్ల అనర్హులు బయటకు వస్తున్నారు. కొంతమంది పెండ్లికాని వారు జాబితాలో చేరారు. తెల్లరేషన్ కార్డులకు సైతం భూములు, ఆస్తులు ఉన్నవారు కూడా అర్హత ఉన్నట్టుగా లబ్ధిదారుల్లో చేర్చారు. కొన్నిచోట్ల అభ్యంతరాలతో తొలగించారు. పెనుబల్లి మండలం వీఎం బంజరలో పనిచేస్తున్న కాంట్రాక్టు వర్కర్లు ఉపాధి హామీలో పని చేస్తున్నట్టుగా మస్టర్లు ఉండడంతో ఇందిరమ్మ ఆత్మీయ భరోసా లబ్ధిదారులుగా గుర్తించి జాబితాలో చదివారు. గ్రామస్థులు అభ్యంతరం చెప్పడంతో వారి పేర్లు తొలగిస్తున్నట్టు తెలిపారు. ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డులు అర్హుల జాబితాలో లేనివారు మాత్రం కొన్నిచోట్ల ఘర్షణలకు దిగడం, తర్వాత వారిని తిరిగి దరఖాస్తు చేయాలని చెప్పడంతో సాఫీగా సాగాయి. శుక్రవారం అర్హుల జాబితా కొలిక్కిరానుంది.

విత్తన లోపం.. ఎవరిది పాపం..?

నాసిరకం విత్తనాలతో ఆయిల్‌ఫెడ్‌కు రూ.4 కోట్ల నష్టం

- రేగళ్లపాడు నర్సరీలో 'పోతు' మొక్కల గుర్తింపు
- రైతులకు విక్రయించకూడదని నిర్ణయం
- గతంలోనూ 2019లో తోటల్లో గెలలు రాని వైనం



అశ్వారావుపేట/సత్తుపల్లి, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): పామాయిల్ మొక్కల కోసం విత్తనాలను దిగుమతి చేసుకునే సందర్భంగా నాణ్యతను పట్టించుకోని కారణంగా ఆయిల్‌ఫెడ్ భారీ మూల్యాన్నే చెల్లించుకోవాల్సి వచ్చింది. విత్తనాల ధర, మొక్కల పెంపకం, పర్యవేక్షణ తదితరాలకు రూ.నాలుగు కోట్లను ఆయిల్‌ఫెడ్ వెచ్చించింది. తీరా మొక్కలు పెరిగాక వాటిలో లోపం ఉన్నట్టు గుర్తించడంతో భారీ నష్టం వచ్చినట్లయింది.

2023లో ఖమ్మం జిల్లా సత్తుపల్లి మండలం రేగళ్లపాడు నర్సరీలో ఆయిల్‌ఫెడ్ నాలుగు లక్షల విత్తనాలను దిగుమతి చేసుకొని పెంచుతోంది. ఇటీవల రేగళ్లపాడు నర్సరీలో సుమారు 80 వేల 'పోతు మొక్కలు' వచ్చాయని గుర్తించి ధ్వంసం చేసిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మరో 70వేలు మొక్కలపైన అధికారులు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

వచ్చిన విత్తనాల్లో అధికశాతం నాసిరకంగా ఉన్నట్టు అధికారులు గుర్తించారు. అయినా ఉన్నతాధికారుల ఆదేశాలమేరకు 17 నెలలపాటు లక్షలాది రూపాయలు వెచ్చించి మొక్కలను పెంచారు. వీటిలో లక్షన్నర మొక్కలు బాగోలేవని గుర్తించి వాటిని పక్కకు పెట్టారు. వీటి నుంచి 80 వేల మొక్కలను ఆయిల్‌ఫెడ్ అధికారులు ధ్వంసం చేసిన సంఘటన ఇటీవలే వెలుగులోకి వచ్చింది. ఈ మొక్కలను స్థానిక అధికారులు ఎటువంటి అనుమతులు లేకుండా ధ్వంసం చేశారనే ప్రచారం జరగడంతో ఆయిల్‌ఫెడ్ విచారణ కమిటీని వేసింది. కాగా 2023 బ్యాచ్‌లో మొలకెత్తించిన మొక్కలను రైతులకు సరఫరా చేయలేదు. ఈ విత్తనాల దిగుమతి, మొక్కలు పెంపకం ద్వారా (మిగతా 6వ పేజీలో)

నేడు, రేపు మంత్రి తుమ్మల పర్యటన



ఖమ్మం కలెక్టరేట్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శుక్ర, శనివారాల్లో జిల్లాలో పర్యటించనున్నారు. ఉదయం 9:30కి ఖమ్మం నగరంలోని 8వ డివిజన్ బాలపేటలో బల్లేపల్లి నుంచి బాలపేట వరకు రోడ్డు విస్తరణ పనులకు శంకుస్థాపన చేస్తారు. శనివారం రోజు 11 గంటలకు 15వ డివిజన్ అల్లిపురంలో రామకృష్ణాపురం, జంగాల కాలనీలకు రోడ్ల విస్తరణ పనులకు శంకుస్థాపన చేస్తారు.

'మొహాలీ' మోసంపై కొరడా

8 మందిపై కేసు నమోదు

ఖమ్మం క్రైం, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగాల పేరుతో మోసంచేసి బెదిరించిన 8 మందిపై గురువారం రాత్రి కేసు నమోదు చేసినట్లు సీసీఎస్ ఏసీపీ సర్వర్ తెలిపారు. చండీగఢ్ మొహాలీలో ఓ సంస్థ వారు.. ఉద్యోగాల పేరిట పలువురికి గాలం వేసి, అక్కడకి రప్పించిన తరువాత ఇబ్బందులు పెడుతున్నారని కొంతమంది బుధవారం రాత్రి ఖమ్మం చేరుకున్న సంఘటన తెలిసిందే. ఈ ఘటనపై వైరాకు చెందిన మల్లు మధులత ఫిర్యాదు చేయటంతో భాస్కర్, అశోక్, విగ్నేష్, కీర్తన, నిహారిక, ఆశ, గౌతమ్, తరుణ్‌లపై కేసు నమోదుచేసి పోలీసులు విచారణ చేపట్టారు. అయితే వీరు ఎక్కడి వారనేది వెల్లడించలేదు.

మరో 4 డీసీసీబీ శాఖలు



- మంత్రి తుమ్మల సహకారంతో బ్యాంకు అభివృద్ధి
- గతేడాది కంటే అధికంగా రూ.103.76 కోట్ల డిపాజిట్లు
- ఈ ఏడాది రూ.407.39 కోట్ల అధిక వ్యాపారం
- బ్యాంకు ఛైర్మన్ దొండపాటి వెంకటేశ్వర్లు

6

అర్హుల జాబితాల్లో అనర్హులు

గ్రామసభల్లో వెలుగుచూసిన లొసుగులు

కూసుమంచి, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పథకాల్లో అర్హుల జాబితాలను వెల్లడించేందుకు ఏర్పాటుచేసిన గ్రామసభల్లో మూడోరోజూ ప్రజల నుంచి నిరసనలు కొనసాగాయి. అనర్హులను ఎంపిక చేయడం, అర్హులను విస్మయించడంతో ప్రజల నుంచి పెద్దఎత్తున వ్యతిరేకత వ్యక్తమైంది. మండలంలో గురువారం కృష్టాపురం, గంగబండతండ, రాజుపేట, ఈశ్వరమాధారం, కేశవాపురం గ్రామాల్లో గ్రామసభలు జరిగాయి. ఈ సందర్భంగా మండలంలో ఓ హెచ్ఎం కుటుంబానికి ఇందిరమ్మ ఇంటిని అధికారులు మంజూరు చేశారు. ఖమ్మంలో కమీషన్ వ్యాపారం చేస్తున్న ఓవ్యాపారికి ఆత్మీయ భరోసా మంజూరు చేశారు. అదేవిధంగా ఖమ్మం-సూర్యాపేట జాతీయ రహదారి పక్కన సుమారు మూడు కోట్ల విలువైన భూమి ఉన్న రైతుకు రేషన్‌కార్డు మంజూరు చేశారు. దీంతో గ్రామాల్లో అధికారుల సర్వే తీరుపై నిరసనలు కొనసాగాయి. వెంటనే తిరిగి సర్వే చేయాలని డిమాండ్ చేశారు. అధికారులతో వాగ్వాదానికి దిగారు. అయితే ఇవి ఫైనల్ లిస్ట్ కాదని అర్హులు మళ్లీ దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పినా ప్రజలు నమ్మడం లేదు.



కూసుమంచి మండలం గంగబందతండాలో అధికారులను నిలదీస్తున్న ప్రజలు

త్వరలో నాలుగు డీసీసీబీ
నూతన శాఖలు ప్రారంభం

- మంత్రి తుమ్మల సహకారంతో బ్యాంకు అభివృద్ధి
- గతేడాది కంటే అధికంగా రూ.103.76కోట్ల డిపాజిట్లు
- ఈ ఏడాది రూ.407.39కోట్ల అధిక వ్యాపారం
- రైతులకు ఉచితంగా బీమా సౌకర్యం
- బ్యాంకు చైర్మన్ దొండపాటి వెంకటేశ్వర్లు



ఖమ్మం వ్యవసాయం, జనవరి 23(ఆంధ్రజ్యోతి):ఖమ్మం కేంద్ర సహకార బ్యాంకు వ్యాపారంలో, రైతులకు సేవలందించడంలో గత ఏడాదితో పోలిస్తే ఈ యేడాది పురోగతిలో ఉందని బ్యాంకు చైర్మన్ దొండపాటి వెంకటేశ్వర్లు తెలిపారు. గురువారం డీసీసీబీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో బ్యాంకు అధ్యక్షుడు దొండపాటి వెంకటేశ్వర్లు మాట్లాడారు. ప్రతీ సంవత్సరం మార్చి ఆర్థిక సంవత్సరానికి ఈ సంవత్సరానికి పోల్చుకుంటే ఈ యేడాది రూ. 407.39 కోట్ల వ్యాపారం పెరిగిందని వివరించారు. త్వరలో డీసీసీబీ ఆధ్వర్యంలో నూతనంగా నాలుగు బ్రాంచిలు ఏర్పాటు చేయనున్నామని తెలిపారు. కరుణగిరి, కందుకూరు, అడసర్లపాడు, చెరువుమాధారంలో నూతనంగా శాఖలను త్వరలో ప్రారంభించి ప్రజలకు, రైతులకు సేవలందిస్తామని తెలిపారు. వీటికి సంబంధించి వందశాతం పనులు పూర్తయ్యాయని తెలిపారు.

సహకారశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సహకారంతో బ్యాంకు రోజురోజుకు అభివృద్ధి చెందుతోందని, మంత్రి జిల్లాకు చెందిన వారు కావడం మన అదృష్టమని, దాని వల్ల సులభంగా అభివృద్ధి జరుగుతోందని దొండపాటి వెంకటేశ్వర్లు తెలిపారు.

రుణమాఫీ అంశంలో 77వేల మంది రైతులకు దాదాపు రూ.320 కోట్లను లబ్ధి చేకూర్చినట్లు తెలిపారు. గతంలో బీమాప్రీమియం రూ.19గా ఉండేదని, దానిని బీమా కంపెనీల ప్రతినిధులతో మాట్లాడికి రూ.14లకు చేసినట్లు తెలిపారు. ఈ ప్రీమియాన్ని బ్యాంకే భరించి రైతుల పక్షాన బీమా కంపెనీలకు చెల్లించనున్నట్టు తెలిపారు. రైతులకు ఉచితంగా బీమా సదుపాయం కల్పించినట్టు తెలిపారు.

నిరంతర నిఘా, పర్యవేక్షణ ఉంటుంది, సిబ్బంది రైతులకు ఇబ్బంది కలిగిస్తే కఠిన చర్యలు ఉంటాయని తెలిపారు. గతంలో లేనివిధంగా ప్రాథమిక సంఘాల బలోపేతానికి ప్రత్యేక విభాగం ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. కౌలు రైతులకు కూడా రుణాలు ఇచ్చేందుకు ప్రత్యేక కార్యాచరణ, సంఘాల ద్వారా బ్యాంకు వ్యాపారంలో రైతులను నేరుగా భాగస్వామ్యం చేయనున్నట్టు తెలిపారు. యూరియా, డీఏపీ, ఎరువులు రైతులకు అప్పుగా ఇవ్వడానికి ప్రత్యేక కార్యాచరణ, ఏజెన్సీ ప్రాంతాల్లోని రైతులకు లబ్ధి చేకూరేలా, రుణాలు ఇచ్చేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. గత సంవత్సరం డీసీసీబీలో డిపాజిట్లు 1144.17 కోట్లుగా ఉండగా, ఈ సంవత్సరం 1247.85కోట్లు కాగా రూ. 103.76కోట్లు అధికంగా డిపాజిట్లు పెరిగాయని తెలిపారు. గత సంవత్సరం మొత్తం బిజినెస్ 2984కోట్ల30లక్షలు ఉండగా, ఈడిసెంబరు 24 వరకు 3391కోట్ల97లక్షలుగా ఉందని తెలిపారు. 407.39కోట్ల పెరుగుదల వ్యాపారంలో ఉందని, ఇంకా ఆర్థిక సంవత్సరం మిగిలే ఉందని తెలిపారు. ఇప్పటి వరకు 77,750 మంది రైతులకు నాలుగు దఫాలుగా రెండు లక్షల లోపు రుణాలు నాలు 326కోట్ల3లక్షలు రుణమాఫీ జరిగిందని తెలిపారు. ఈ విలేకరుల సమావేశంలో డీసీసీబీ సీఈవో వెంకటాదిత్య తదితరులు పాల్గొన్నారు.

విమానయాన బృందం పర్యటన
శుభ పరిణామం

- సానుకూల నివేదిక అందిస్తారని ఆశిస్తున్నా..
- విమానాశ్రయం అధ్యయన బృందంతో.. ఎమ్మెల్యే కూనంనేని భేటీ



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

కొత్తగూడెం, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : కొత్తగూడెం ప్రాంతంలో విమానాశ్రయం ఏర్పాటు చేసేందుకు కావాల్సిన పరిస్థితులపై అధ్యయనం చేసేందుకు పౌర విమానయాన ప్రతినిధులు కొత్తగూడెంలో పర్యటించడం శుభ పరిణామమని, బృందం పర్యటనతో విమానాశ్రయం ఏర్పాటు ప్రక్రియ ప్రారంభమైనట్లేనని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. గరీబ్‌పేట ప్రాంతాల్లో అధ్యయన బృందంలో గురువారం బేటి అయిన ఎమ్మెల్యే ఇక్కడి పరిస్థితులను, విమానాశ్రయం ఏర్పాటు ఆశ్యకతను బృందానికి వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రామవరం, గరీబ్‌పేట ప్రాంతంలో ఉన్న స్థలాన్ని బృందం పరిశీలించిందని, సానుకూలమైన నివేదికను కేంద్ర ప్రభుత్వానికి అందిస్తారని ఆశిస్తున్నానన్నారు. స్థల సేకరణపై ఎలాంటి వివాదాలు ఉండబోవని, ఈ ప్రాంత ప్రజలు విమానాశ్రయం ఏర్పాటుకు సానుకూలంగా ఉన్నారని, పారిశ్రామిక ప్రాంతంగ ఉన్న కొత్తగూడెంకు విమానాశ్రయం ఏర్పాటు చేయాలనే లక్ష్యంతోనే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లానని, సమీపంలోని రాష్ట్రాలకు కూడ కొత్తగూడెం విమానాశ్రయం అనుకూలంగా ఉంటుందని తెలిపారు. విమానాశ్రయం ఏర్పాటుతో కొత్తగూడెం ప్రాంతమే కాకుండ భద్రాద్రి జిల్లా సమగ్రంగా అభివృద్ధి సాధిస్తుందని తెలిపారు. ఎమ్మెల్యే వెంట సీపీఐ జిల్లా జిల్లా కార్యదర్శి ఎస్‌కే. సాబీర్ పాషా, మున్సిపల్‌చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి, కమీషనర్ శేసాంజన్‌స్వామి, కౌన్సిలర్లు కంచర్ల జమలయ్య, భూక్య శ్రీనివాస్, బోయిన విజయ్‌కుమార్, ధర్మరాజు, సత్యనారాయణా చారి, మాచర్ల శ్రీనివాస్, యూసుఫ్, ఫహీం, పిడుగు శ్రీనివాస్, నేరెళ్ల రమేష్, గుత్తుల శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

అధికారుల అసమర్ధత వల్లే
ఆయిల్‌ఫెడ్‌కు నష్టం

- పామాయిల్ అడ్వైజరీ కమిటీ సభ్యుడు ఆలపాటి



సమావేశంలో మాట్లాడుతున్న ఆలపాటి రాంచంద్రప్రసాద్

దమ్మపేట, జనవరి 23(ఆంధ్రజ్యోతి): ఆయిల్‌ఫెడ్‌లో పనిచేసే అధికారుల అసమర్ధత వల్ల ఆయిల్‌ఫెడ్‌కు తీవ్ర నష్టంతో పాటు పాటు రైతులకు నష్టం జరిగే పరిస్థితి ఏర్పడిందని పామాయిల్ అడ్వైజరీ కమిటీ సభ్యుడు, ఆయిల్‌పామ్ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆలపాటి రాంచంద్రప్రసాద్ ఆందోళన వ్యక్తంచేశారు. అల్లిపల్లిలోని ఆలపాటి నివాసంలో గురువారం సాయంత్రం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆయిల్‌ఫెడ్‌లోని అధికారుల అనైక్యత వల్ల ఆ ప్రభావం ఆయిల్‌ఫెడ్‌పై పడటంతో సంస్థకు తీవ్ర నష్టం జరుగుతుందన్నారు. దొంగే దొంగే అన్న చందాన ఆయిల్‌ఫెడ్‌లో అధికారుల పరిస్థితి ఉందన్నారు. అధికారుల పనితీరులో మార్పురాకుంటే రైతుల ఆగ్రహాన్ని చవిచూడాల్సిన పరిస్థితి వస్తుందన్నారు. కొందరు రైతులు ప్రైవేటు ఫ్యాక్టరీలకు వత్తాసు పలుకుతున్నారని, దీనివల్ల ఆయిల్‌పామ్ రైతులు అందరికీ నష్టం జరుగుతుందని గుర్తించాలన్నారు. రైతుల అభ్యున్నతి కోసం బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి తుమ్మల నాగేశ్వరరావు కృషి చేస్తున్నారని అన్నారు. తుమ్మల కృషి వల్ల టన్ను రూ.12వేల నుంచి రూ.20వేలకుపైగా పెరిగిందని పామాయిల్ రైతులకు మెరుగైన సేవలు అందించేందుకు ఆయన చర్యలు తీసుకుంటున్నారని గుర్తు చేశారు. కొందరు వ్యక్తులు కావాలని ఆయిల్‌ఫెడ్‌పై బురద చల్లి చెడ్డపేరు తెచ్చేలా వ్యవహరిస్తున్నారని దాని వల్ల పామాయిల్ రైతాంగానికే నష్టం జరుగుతుందని సమస్యలు ఉంటే రైతులు కలిసి చర్చించుకొని సమస్య పరిష్కారం కోసం ఐకమత్యంగా వ్యవహరించాలని ఆలపాటి కోరారు. తుమ్మల నాగేశ్వరరావు వ్యవసాయ శాఖ మంత్రి బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి పామాయిల్ నర్సరీలపై ప్రత్యేక దృష్టి పెట్టి కల్లింగ్ మొక్కలు రాకుండా చర్యలు తీసుకుంటున్నారని కల్లింగ్ మొక్కల వల్ల రైతులకు నష్టం జరిగితే సంబంధిత అధికారులదే బాధ్యత అంటూ బాధ్యులను చేస్తూ హెచ్చరించారని ఆలపాటి గుర్తు చేశారు. కొత్తగా పెట్టిన నర్సరీలు ఏమిలేవని గతంలో జరిగినవేనని పామాయిల్ రైతులు గుర్తించాలన్నారు. కొందరు నర్సరీలు మొక్కలపై కావాలని తప్పుడు ప్రచారం చేస్తున్నారని దీనివల్ల రైతులకు తప్పుడు సంకేతాలు వెళతాయని రైతులకు మంచిచేసేలా ఉండాలని నష్టం చేసే చర్యలు చేపట్టవద్దని హితవు పలికారు. పామాయిల్ సమస్యలపై అందరు కలిసి చర్చించుకొని ముందుకు వెళదామన్నారు. ఈ సమావేశంలో కోటగిరి సీతారామస్వామి, జూపల్లి రమణారావు, సీమకుర్తి వెంకటేశ్వరరావు, కొయ్యల అచ్యుతరావు, కాసాని నాగప్రసాదు, కేవీ సత్యనారాయణ, ఎర్రా వసంతరావు, మాజీ ఎంపీపీ సోయం ప్రసాద్ పాల్గొన్నారు.



నీరుకొండ హనుమంతరావు, తురుమెళ్ళ కళ్యాణికి పురస్కారాలు ప్రదానం చేస్తున్న నిర్వాహకులు

భద్రాద్రికి రెండు
'గిడుగు' పురస్కారాలు

సేవారంగం, సాహిత్య రంగాల్లో రాణిస్తున్న ఇద్దరికి అవార్డులు

చుంచుపల్లి, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): గిడుగు రామ్మూర్తి పంతులు వర్ధంతిని పురస్కరించుకొని పంతులు ఫౌండేషన్ వారు వివిధ రంగాల్లో అందించిన సేవలకు జాతీయ పురస్కారాలను గురువారం హైదారాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ప్రదానం చేశారు. ఈ వేడుకల్లో భద్రాద్రి జిల్లాకు చెందిన ఇద్దరిని అవార్డులు వరించాయి. వీరిలో తెలంగాణ సీనియర్ సిటీజన్స్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు నీరుకొండ హనుమంతరావుకు గిడుగు జాతీయ పురస్కారం ప్రకటించారు. చుంచుపల్లి మండలంలోని విద్యానగర్‌కాలనీలో 2014లో సీనియర్ సిటిజన్ అసోసియేషన్ ఏర్పాటు చేసి వివిధ సేవా కార్యక్రమాలు మలి వయస్సులో చేస్తూ నేటి తరానికి ఆదర్శంగా నిలిచారు. నీరుకొండ అందిస్తున్న సేవలను పరిగణలోనికి తీసుకొని ఈ అవార్డును ప్రదానం చేశారు. అదేవిధంగా కొత్తగూడెం వాసి హిందీ ఉపాధ్యాయుడిగా చర్ల మండలం తేగడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న తురుమెళ్ల కళ్యాణికి జాతీయ సాహిత్య పురస్కారం లభించింది. కళ్యాణి రచించిన కలం నా గళం అనే కవితా సంపుటి ఎంపికవడం భద్రాద్రి జిల్లాకే గర్వకారణం. ఒకే వేదికపై భద్రాద్రి జిల్లా వాసులకు రెండు జాతీయ పురస్కారాలు లభించడం పట్ల సీనియర్ సిటిజన్ అసోసియేషన్ సభ్యులు, ఉపాధ్యాయ సంఘాలు శుభాకాంక్షలు తెలిపారు. ఈ ప్రదానోత్సవ వేడుకల్లో హైకోర్టు జస్టిస్ డాక్టర్ రాధారాణి, గిడుగు మనవరాలు డాక్టర్ కాంతి కృష్ణ, శంకరంవేదిక అధ్యక్షులు యలవర్తి ధనలక్ష్మి, కళారత్న డాక్టర్ బిక్కికృష్ణ, విమల సాహితీ అధ్యక్షుడు ఐఆర్ఎస్ డాక్టర్ విద్యాధర్, తెలుగువన్ ఛానల్ వ్యవస్థాపకుడు కంఠంనేని రవిశంకర్, ఏపీ నాటక అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ హాజరై ఈ అవార్డును ప్రదానం చేశారు.

వనదేవతలను తీసుకొస్తున్న పూజారులు



వనం నుంచి జనంలోకి వన దేవతలు

కరకగూడెం, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): గిరిజన సాంప్రదాయలతో డప్పు చప్పుళ్లతో గురువారం వన దేవతలు గద్దెలపై కొలువుదీరారు. కరకగూడెం మండలం చొప్పాల పరిధిలోని గుట్టపై సమ్మక్క, సారలమ్మ జాతర మూడు రోజులుగా అంగరంగ వైభవంగా జరిగింది. మంగళవారం మండెమెలుగు కార్యక్రమంతో మొదలైన జాతర బుధవారం సారలమ్మ గద్దెలపైకి చేరగా.. గురువారం వనదేవత గుట్ట నుంచి సమ్మక్క, పగిడిద్దెరాజును పూజారులు గిరిజన సాంప్రదాయాల నడుమ డప్పు వాయిద్యాలతో గుడి వద్దకు చేరుకున్నారు. ఆలయ పూజారి దేవరబాల డిల్లీ సరోజిని తీర్థ ప్రసాదాలను అందజేశారు. శుక్రవారం శుంఖు పండుగ, శనివారం వన దేవతలను గుట్టకు చేర్చుతారు.

నిర్మాణ లోపంతో పగుళ్లిచ్చిన బంకర్లు

- తొమ్మిది నెలల క్రితం ఒకటి, తాజాగా మరొకటి
- రూ.400 కోట్లతో నిర్మించిన సీహెచ్‌పీలో బయటపడుతున్న లోపాలు
- రూ.కోట్లలో సింగరేణి సంస్థకు నష్టం
- మరమ్మతులు చేస్తామంటున్న అధికారులు

సత్తుపల్లి, జనవరి 23 (ఆంధ్రజ్యోతి):సత్తుపల్లిలో సింగరేణి సంస్థ నిదులతో నిర్మించిన కోల్ హ్యాండ్లిగ్ ప్లాంట్ (సీహెచ్‌పీ)లో నాణ్యతా లోపాలు ఒక్కొక్కటిగా బయట పడుతున్నాయి. రూ.400 కోట్ల వ్యయంతో నిర్మించిన సీహెచ్‌పీలో 9 నెలల క్రితం ఒక బంకర్‌కు పగుళ్ల రాగా మరో బంకర్‌లో కూడా తాజాగా పగుళ్ల వచ్చినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. గతంలో పగుళ్లిచ్చిన బంకర్‌కు సంబంధించి రెండు సంస్థలకు చెందిన ఇంజనీరింగ్ నిపుణులు అధ్యయనం చేసారు. పగుళ్ల కారణంగా సదరు బంకర్‌లో గత ఏడాది జులైలో బొగ్గు లోడింగ్ నిలిపివేశారు. దీంతో బొగ్గు రైల్వే మార్గంలో రవాణా లక్ష్యం మేరకు జరగని పరిస్థితి నెలకొంది.

సీహెచ్‌పీ పూర్వపరాలు....

సింగరేణి సంస్థ ఆధ్వర్యంలో రూ.400కోట్ల వ్యయంతో కోల్ హ్యాండ్లింగ్ ప్లాంట్ నిర్మాణం 2019లో చేపట్టారు. అప్పట్లో కొవిడ్ కారణంగా పనులు సకాలంలో పూర్తి కాలేదు. ఆ తరు వాత దీనిని పూర్తి చేసి అదే సమయంలో రైల్వే లైను కూడా అందుబాటులోకి రావటంతో ఏక కాలంలో ప్రారంభించారు. సత్తుపల్లి మండలంలో 120 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి రవాణా లక్ష్యంగా అధికారులు శ్రమిస్తున్నారు. రోడ్డు మార్గంలో బొగ్గు రవాణాను పర్యావరణ శాఖ వ్యతిరేకించటంతో పర్యావరణం కలుషితం కాకుండా సీహెచ్‌పీ నిర్మించి అక్కడి నుంచి రైల్వే మార్గంలో బొగ్గు రవాణా చేయాలని నిర్ణయించారు. ఈ క్రమంలో సీహెచ్‌పీ నిర్మాణంపూర్తి చేశారు. ఓపెన్‌కాస్టుల్లోని బొగ్గును తొలుత బంకర్ల ద్వారా కోల్ రిసీవింగ్ ప్లాంట్‌కు తరలిస్తారు. అక్కడి నుంచి నాలుగు కిలోమీటర్ల దూరం కన్వేయర్ బెల్టుపై బొగ్గును కిష్టారం సమీపంలో నిర్మించిన మూడు జైలో బంకర్లకు తరలిస్తారు. మూడు బంకర్ల సామర్థ్యం 24వేల టన్నులు. మూడు బంకర్లలో తొమ్మిది నెలల క్రితం ఒక బంకర్‌కు పగుళ్ల రాగా తాజాగా మరో బంకర్‌కు కూడా పగుళ్ల వచ్చినట్లు సమాచారం.

పగుళ్లపై అధ్యయనం..

రూ.వందల కోట్లు ఖర్చు చేసి నిర్మించిన సీహెచ్‌పీలోని బంకర్లు పగుళ్ల రావటంతో ఇలా ఎందుకు జరిగిందనే విషయంపై సింగరేణి సంస్థ ఉన్నతాధికారులు ప్రముఖ సంస్థలకు చెందిన నిపులతో అధ్యయనం చేయించారు. దీనిని నిర్మించిన కాంట్రాక్టు సంస్థకు పూర్తి స్థాయిలో బిల్లులు కూడా చెల్లించినట్లు తెలిసింది. నిర్మాణంలో జరిగిన లోపాల కారణంగా బంకర్లు పగుళ్లిచ్చిన విషయం బహిర్గతమే దీనిలో ఎవరి వైఫల్యం ఎంత అనేది తేలాల్సి ఉంది.

రైల్వే ద్వారా లక్ష్యం చేరని బొగ్గు రవాణా

సాధారణంగా సీహెచ్‌పీలో బంకర్లు మొత్తం నాణ్యతా ప్రమాణాలు ఉంటే ఎనిమిది నుంచి తొమ్మిది ర్యాకుల బొగ్గు ఇక్కడి నుంచి రవాణా అయ్యేది. గతంలో రైల్వే మార్గంలో ఈ స్థాయిలో బొగ్గు రవాణా జరిగింది. కాని బంకర్లలో పగుళ్ల కారణంగా 6, 7 ర్యాకుల బొగ్గు మాత్రమే రవాణా జరుగుతోందని తెలిసింది. మిగిలిన బొగ్గు మరలా రోడ్డు మార్గంలోనే రవాణా కావాల్సిన పరిస్తితి నెలకొంది. ఒక్కో ర్యాకు నాలుగు వేల టన్నుల బొగ్గు రవాణా జరుగుతుంది. రైల్వే లైను ప్రారంభించి, సీహెచ్‌పీని రూ.వందల కోట్లతో నిర్మించినా నిర్మాణం, నాణ్యతా లోపాల కారణంగా తిరిగి పర్యావరణానికి విఘాతం కలిగే రీతిలో రోడ్డు మార్గంలోనే బొగ్గు ఆర్‌వీహెచ్‌పీకి తరలించాల్సివస్తోంది.



కోల్ హ్యాండ్లిగ్ ప్లాంట్

త్వరలో మరమ్మతులు చేయిస్తాం
షాలెంరాజు, సీఎం, కొత్తగూడెం ఏరియా

సాంకేతికపరమైన ఇబ్బందుల వల్ల బంకర్‌లో పగుళ్ల ఏర్పడ్డాయి. దీనిపై అధ్యయనం చేయించాం. హైదరాబాద్ ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీకి చెందిన నిపుణుల సలహాలతో బంకర్ మరమ్మతులు పూర్తి చేయించనున్నాం. త్వరలో మరమ్మతు పనులు ప్రారంభిస్తాం.

ప్రతీ ఒక్కరికి సంక్షేమ ఫలాలు

- రేషన్‌కార్డుల జారీ నిరంతర ప్రక్రియ
- పాలేరును ఆదర్శంగా తీర్చిదిద్దుతా: మంత్రి పొంగులేటి



రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి

తిరుమలాయపాలెం, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పాలేరు నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. గురువారం మండలంలోని కేశవాపురం, జోగులపాడు, చంద్రుతండా, మహ్మదాపురం, హైదర్‌సాయిపేట, తిప్పారెడ్డిగూడెం, పడమటితండా తదితర గ్రామాల్లో రూ.1.60 కోట్లతో చేపడుతున్న పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేశారు. జోగులపాడులో సీసీ రోడ్లు, నూతనంగా నిర్మిస్తున్న పంచాయతీ భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నాలుగు పథకాలకు సంబంధించిన నిర్వహించిన గ్రామసభలో చదివిన జాబితా ఫైనల్ కాదని, ప్రజలనుంచి వచ్చిన ప్రతి దరఖాస్తును పరిశీలించి అర్హులైన వారికి రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చే బాధ్యత తనదేనన్నారు. గ్రామసభ జాబితాలో పేరులేకపోతే ఆందోళన పడాల్సిన పనిలేదన్నారు. ఈ పథకాలు నిరంతరాయంగా కొనసాగుతాయన్నారు. అర్హుల ఎంపిక నిరంతరంగా సాగుతుందన్నారు. జాబితాలో అనర్హులుంటే సమాచారం ఇస్తే విచారించి తొలిగిస్తామన్నారు.

పాలేరు నియోజకవర్గంలో ఇళ్లపై వేలాడుతూ ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ లైన్లను మార్చేందుకు రూ.9కోట్లు వెచ్చించి మరమ్మతులు చేస్తున్నట్టు మంత్రి తెలిపారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో ఇళ్ల ముందు విద్యుత్ తీగలు వేలాడుతూ ప్రమాదకరంగా ఉన్నాయన్నారు. 11కేవీ విద్యుత్ లైన్లు కూడా ఇళ్లపై వేలాడుతూ ఉండేవని, వీటిని కూడా తొలగించి శాశ్వతంగా పరిష్కరిస్తున్నట్టు తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఐడీసీ చైర్మన్ మువ్వా విజయ్‌బాబు, తుళ్లూరి బ్రహ్మయ్య, బొర్ర రాజశేఖర్, మాజీ మహిళ కార్పొరేషన్ చైర్మన్ మద్దినేని బేబి స్వర్ణకుమారి, జిల్లా కాంగ్రెస్ నాయకులు రామసహాయం నరేష్‌రెడ్డి, ఆత్మకమిటీ చైర్మన్ చావా శివరామకృష్ణ, మాజీ జడ్పీటీసీ బెల్లం శ్రీను, తహసీల్దార్ వీవీ రామకృష్ణ, ఎంపీడీవో సిలార్‌సాహెబ్, డీఈ రమేష్‌రెడ్డి, పీఆర్ ఈఈ వెంకటరెడ్డి, డీఈ వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్‌ఫెడ్‌కు రూ.4కోట్ల నష్టం

(5వ పేజీ తరువాయి)

ఆయిల్‌ఫెడ్‌కు రూ. కోట్లలో నష్టం వాటిల్లింది. వీటిని రైతులకు సరఫరా చేసి ఉంటే భారీ నష్టం వాటిల్లి ఉండేది.

గతంలోనూ అనుభవాలు..

2019 బ్యాచ్‌లోనే ఆయిల్‌ఫెడ్ సరఫరా చేసిన పామాయిల్ మొక్కలను పెంచిన సత్తుపల్లి ప్రాంతంలోని 30 ఎకరాల తోటల్లో నాలుగు సంవత్సరాలు దాటిన గెలలు రాకపోవడాన్ని రైతులు గుర్తించారు. నారాయణపురానికి చెందిన పుచ్చకాయల సోమిరెడ్డి అనే రైతు ఆయిల్‌ఫెడ్‌పై కోర్టుకు వెళ్లారు. రైతులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఆయిల్‌ఫెడ్ అధికారులు వీటిని తోసి పుచ్చడంతో నష్టపరిహారం చెల్లించాలని రైతులు కోర్టును ఆశ్రయించారు. 2019 నుంచి 2024 మధ్య జరిగిన విత్తన దిగుమతులు, ఇతర అంశాలపై విచారణ జరపాలనే డిమాండ్ రైతులనుంచి వ్యక్తం అవుతోంది. లేకుంటే రైతులు నాలుగేళ్లపాటు లక్షలాది రూపాయలు వెచ్చించి పెంచిన తరువాత దిగుబడులు రాక భారీ నష్టాల పాలవుతారనే ఆందోళన వ్యక్తం అవుతుంది. ఈ మొత్తం వ్యవహారంలో ఆయిల్‌ఫెడ్ అధికారులెవ్వరూ నోరు మెదపటం లేదు.

తొలి అడుగు

(5వ పేజీ తరువాయి)

అంతర్జాతీయ ప్రమాణాలను పరిశీలించి సమగ్రంగా ఆలోచన చేసి త్వరితగతిన నివేదికలు తయారుచేసి కేంద్ర పౌరవిమానయానశాఖకు అందజేస్తామని తెలిపారు. అనంతరం కేంద్ర బృందం సభ్యులను జిల్లా యంత్రాంగం సత్కరించింది. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ డి. వేణుగోపాల్, కొత్తగూడెం ఆర్డీవో మధు, తహసిల్దార్లు పుల్లయ్య, శిరీష, సీపీవో సంజీవరావు, ఎంపీటీసీ ఎల్ఎస్‌పీ. మహేందర్, ఆర్అండ్‌డీ ఈఈ వెంకటేశ్వరరావు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

చిరకాల కోరిక నెరవేరబోతోంది: కలెక్టర్ జితేష్ వి పాటిల్

కొత్తగూడెంలో విమానాశ్రయం ఏర్పాటుకు ముందడుగు పడుతోందని, భద్రాద్రి జిల్లా వాసుల చిరకాల కోరిక నెరవేరబోతుందని కలెక్టర్ జితేష్ వి పాటిల్ తెలిపారు. కొత్తగూడెం ఐడీఓసీలో జరిగిన సమావేశంలో విమానాశ్రయ ఆవశ్యతకన పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. జిల్లాలో పర్యాటక, వాణిజ్య రంగ అభివృద్ధికి విమానాశ్రయం ఎంతగానో దోహదపడుతుందన్నారు.

కనీస వేతనాలు చెల్లించాలి

భద్రాచలం, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): కనీస వేతనాల సర్క్యులర్ ప్రకారం యధావిధిగా వేతనాలు చెల్లించాలని సీఐటీయు జిల్లా కార్యదర్శి ఏజే రమేష్, జిల్లా అధ్యక్షులు కె.బ్రహ్మాచారి అన్నారు. భద్రాచలంలో సీఐటీయూ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ డైలీవేజ్, కాంటినెంట్, పార్ట్‌టైం వర్కర్లకు వేతనాలు నిర్ణయిస్తూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం జారీ చేసిన జీవో నెం.64 అమలును నిలిపివేయాలని అన్నారు. జీవో నెం.64 అమలు చేస్తూ భారీగా వేతనాలు తగ్గిపోతాయని పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచవలసిన ప్రభుత్వం అందుకు విరుద్ధంగా తెచ్చిన 64 జీవోను ప్రభుత్వ అమలు చేసేందుకు ప్రయత్నం చేయడం గిరిజన కార్మికులకు ద్రోహదం చేయడమేనని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో హీరాలాల్, పాయం ముత్తయ్య, మంగమ్మ, కౌసల్య, ముసలయ్య, పాపారావు, కనకరాజు, నాగమణి, ముసలయ్య పాల్గొన్నారు.

ఘొల్లుమన్న నిదానపురం

(5వ పేజీ తరువాయి)

చేసుకోవాలని నిర్ణయించుకున్నారు. ఈ క్రమంలో మౌనికను బాజీ తన స్వగ్రామానికి తీసుకువచ్చాడు. ఈ విషయం తెలుసుకొని మౌనిక తల్లిదండ్రులు నిదానపురం వచ్చి, పెళ్లి చేసుకోవద్దని మౌనికను వేడుకున్నారు. అయినా ఆమె ససేమిరా అనడంతో ఖమ్మం టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అయితే తాను మేజర్‌నని, తన ఇష్టప్రకారమే పెళ్లి చేసుకుంటున్నానని మౌనిక చెప్పడంతో పోలీసులు కౌన్సిలింగ్ నిర్వహించి పంపించారు. అప్పుడే పుట్టింటి వారు.. 'నీతో మాకిక సంబంధం లేదు..' అంటూ తెగతెంపులు చేసుకున్నారు.

అనంతరం ముస్లిం సంప్రదాయ పద్ధతిలో మౌనికను బాజీ పెళ్లి చేసుకున్నాడు. ఆమె పేరును ప్రేజాగా మార్చాడు. ఎన్నో ఆశలతో మెట్టినింట అడుగుపెట్టింది. పుట్టినింటి వారిని కాదని వచ్చిన తనను ఎంతో బాగా చూసుకుంటాడని ఆమె భావించింది. మతాంతర వివాహం నేపథ్యంలో ఎదురైన ఇబ్బందులను కూడా ఆమె అధిగమించింది. దాంపత్య జీవితంలో వారికి ఇద్దరు కుమార్తెలు మెహక్(5), మెనురూల్(4) జన్మించారు. అయితే పెళ్లినాడు చేసిన ప్రమాణాలను బాజీ మర్చిపోయాడు. బాధ్యతలు లేకుండా వ్యవహరిస్తూ వచ్చాడు. ఏ పనీ చేయకుండా బలాదూర్‌గా తిరగడం మొదలుపెట్టాడు. ఈ క్రమంలో చోరీలకు అలవాటుపడ్డాడు. ఇవేవీ ప్రేజా (మౌనిక)కు తెలియవు.

పోలీసులు పట్టుకుపోవడంతో..

బైక్‌లు, సెల్‌ఫోన్ల అపహరణ, చైన్ స్నాచింగ్ కేసులకు సంబంధించి బాజీని ఖమ్మం పోలీసులు బుధవారం నిదానపురం వచ్చి అదుపులోకి తీసుకున్నారు. విషయం తెలియడంతో ప్రేజా నిర్ఘాంతపోయింది. తీవ్ర మనస్తాపానికి లోనైంది. అటు పుట్టింటి వారి అండ లేకపోవడం, ఇటు భర్త పోలీసుల అదుపులో ఉండటంతో కుంగిపోయింది. ఈ క్రమంలో గురువారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో తన ఇద్దరు పిల్లలను ఇంట్లో ఇనుపపైపుకు వేలాడదీసి చంపింది. అనంతరం, తాను కూడా దూలానికి ఉరి వేసుకొని చనిపోయింది. మధ్యాహ్నం ఇంటికి వచ్చిన మామ... కోడలు, మనవరాళ్లు విగతజీవులుగా పడి ఉండటాన్ని చూసి ఇరుగుపొరుగు వారిని పిలవడంతో సంఘటన వెలుగుచూసింది. బాజీ తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

తల్లిదండ్రులకు సమాచారం...

ప్రేజా ఆత్మహత్య విషయాన్ని పోలీసులు హైదారాబాద్‌లోని ఆమె తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చినట్టు తెలిసింది. ప్రేజా సెల్‌ఫోన్‌లో ఉన్న నెంబర్ల ఆధారంగా వారితో మాట్లాడినట్టు తెలిసింది. అయితే వారు నిదానపురం వచ్చేది, రానిదీ స్పష్టం చేయలేదని చెబుతున్నారు. మృతదేహాలు ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీలోనే వున్నాయి.

శుక్రవారం పోస్టుమార్టం అనంతరం నిదానపురం తరలించి అంత్యక్రియలు చేస్తారని తెలిసింది. కాగా, తమ అదుపులో వున్న బాజీని గురువారం రాత్రి పోలీసులు బయటకు పంపించడంతో అతడు మార్చురీ వద్దకు వచ్చినట్టు తెలిసింది.

ఇదిలావుండగా, బాజీపై గుడ్డి ప్రేమతో మతాంతర వివాహం చేసుకొని ఎన్నో అటుపోట్ల మధ్య జీవనం గడుపుతున్న ప్రేజా... చివరకు పిల్లలతో సహా ఆత్మహత్యకు పాల్పడటం అందరినీ కలచివేసింది.

విగతజీవులుగా పడివున్న చిన్నారులను చూసి ప్రతీ ఒక్కరు కంటతడిపెట్టారు. పాలబుగ్గల పిల్లలను ఉరి వేసి చంపడానికి చేతులెలా వచ్చాయని రోదించారు. బాజీకి శాపనార్థాలు పెట్టారు. కష్టపడి బతకడానికి బదులు జల్సాలకు అలవాటు పడి చోరీలకు తెగించి ముగ్గురి జీవితాలను అన్యాయంగా బలితీసుకున్నాడని ఆవేదన చెందారు.

జెన్‌కో క్రీడల్లో సత్తాచాటిన కేటీపీఎస్

- చాంపియన్‌గా నిలిచిన కేటీపీఎస్ 5,6 దశల జట్టు
- హాకీ, బాస్కెట్‌బాల్ టోర్నమెంట్లలో సత్తాచాటిన క్రీడాకారులు


విజేతలకు బహుమతులు అందజేస్తున్న జెన్కో డైరెక్టర్ లక్ష్మయ్య

పాల్వంచ,జనవరి23(ఆంధ్రజ్యోతి):మూడు రోజులుగా పాల్వంచ కేటీపీఎస్ కాంప్లెక్స్‌లోని విద్యుత్ కళాభారతిలో నిర్వహించిన జెన్కో స్థాయి క్రీడా పోటీల్లో పాల్వంచ కేటీపీఎస్ 5,6 దశల జట్టు చాంపియన్స్‌గా నిలిచింది. గురువారం జెన్కో డైరెక్టర్ లక్ష్మయ్య బహుమతి ప్రదానం చేసారు. జెన్కోవ్యాప్తంగా అన్ని థర్మల్ విద్యుత్ కేంద్రాల క్రీడాకారులను ప్రోత్సహించేందుకు హాకీ, బాస్కెట్‌బాల్ పోటీలను కేటీపీఎస్ 5,6దశల ఆధ్వర్యంలో నిర్వహించారు. బాస్కెట్ బాల్ టోర్నమెంట్ ఫైనల్స్‌లో కేటీపీఎస్ 5,6దశలజట్టు కేటీపీఎస్ 7వదశ జట్టును 44-22 స్కోరుతో ఓడించి చాంపియన్‌గా నిలిచింది. హాకీ టోర్నమెంట్‌లో కేటీపీఎస్ 5,6 దశలజట్టు భూపాలపల్లి జట్టుపై2-0స్కోరుతో విజయం సాధించింది. కార్యక్రమంలో కేటీపీఎస్ 5,6దశల సీఈ ప్రభాకరరావు, 7వదశ సీఈ వెంకటేశ్వరరావు, ట్రైనింగ్ సెంటర్ సీఈ శ్రీనివాసబాబు, స్పోర్ట్స్ కౌన్సిల్ బాధ్యులు మోక్షవీర్, వీరస్వామి, లోహిత్ ఆనంద్, రాజు, కట్ట శ్రీధర్, బరగడి రామారావు, తోట అనీల్, రెఫరీలుగా వ్యవహరించిన ఆరీఫ్, ఇలియాజ్ పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీలకు ఖమ్మం క్రీడాకారిణులు



మైథిలిని అభినందిస్తున్న సునిల్‌రెడ్డి, జకీరుల్లా, పోటీలకు ఎంపికైన ఔచిత్య

ఖమ్మంస్పోర్ట్స్,జనవరి23(ఆంధ్రజ్యోతి): ఉత్తారాఖండ్‌లో ఈనెల 28నుంచి ఫిబ్రవరి 14వరకు నిర్వహించే 38వజాతీయ అథ్లెటిక్స్ పోటీలకు ఖమ్మం ఎస్ఆర్అండ్‌బీజీఎన్ఆర్ డిగ్రీకళాశాల విద్యార్థిని ఒ.ఎ.మైథిలి ఎంపికైంది. ఆమె ఈనెల 20న హన్మకొండలో జరిగిన 100 మీటర్ల పరుగు పోటీలో ప్రథమ బహుమతి సాధించి జాతీయ పోటీలకు ఎంపికైంది. ఫిబ్రవరి11న కోల్‌కతాలో జరగనున్న జాతీయస్థాయి జూనియర్ ఆర్చరీ పోటీలకు సర్దార్ పటేల్ స్టేడియంలో ఖేలో ఇండియా శిక్షణా కేంద్రంలో తర్ఫీదు పొందుతున్న సీహెచ్. ఔచత్య ఎంపికైంది. ఔచిత్య ఈనెల 19న హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి ఆర్చరీ పోటీలలో ప్రథమ బహుమతి సాధించి జాతీయ పోటీలకు ఎంపికైంది. వీరిని డీవైఎస్‌వో సునిల్‌రెడ్డి, ఎస్ఆర్అండ్‌బీజీఎన్ఆర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జకీరుల్లా, అథ్లెటిక్స్ కోచ్ గౌస్, ఆర్చరీ కోచ్ నగేష్ తదితరులు అభినందించారు. జాతీయ పోటీల్లో రాణించి ఖమ్మం జిల్లాకు ఖ్యాతిని తీసుకురావాలని ఆకాంక్షించారు.

26న జిల్లాస్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలు

ఖమ్మంస్పోర్ట్స్, జనవరి 23(ఆంధ్రజ్యోతి): రిపబ్లిక్‌డేను పురస్కరించుకొని ఈనెల 26న ఖమ్మం సర్దార్ పటేల్ స్టేడియంలో జిల్లాస్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు బాలసాని విజయ్, ఓలేటి సాంబమూర్తి తెలిపారు. గురువారం పోటీల పోస్టర్‌ను ఆవిష్కరించారు. పోటీలు ఆదివారం మధ్యాహ్నం 2 గంటల నుంచి రాత్రి8 గంటల వరకు జరుగుతాయని వారు తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు పేర్లను ముందుగానే నమోదు చేసుకోవాలని సూచించారు. ఇతర సమాచారానికి 9848408335 నెంబరును సంప్రదించాలని కోరారు.

ముగిసిన అంతర్ జిల్లా పాలిటెక్నిక్ క్రీడలు


ఓవరాల్ చాంపియన్‌గా నిలిచిన రుద్రంపూర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల జట్టు

చుంచుపల్లి, జనవరి23(ఆంధ్రజ్యోతి): చదువుతో పాటు క్రీడలు తప్పనిసరని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ నాగముని నాయక్ అన్నారు. గురువారం రుద్రంపూర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో జిల్లాస్థాయి ఇంటర్ డిస్ట్రిక్ట్ పాలిటెక్నిక్ క్రీడల ముగింపు వేడుకలకు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. క్రీడల్లో పాల్గొన్న ప్రతీ క్రీడాకారుడిని అభినందించారు. గెలుపోటములకు అతీతంగా అత్యుత్తమ ప్రదర్శన కనబర్చారని శుభాకాంక్షలు తెలిపారు. వివిధ విభాగాలలో ఓవరాల్ చాంపియన్‌గా రుద్రంపూర్ పాలిటెక్నిక్ కళాశాల నిలవడం హర్షించదగ్గ విషయమని అన్నారు. వ్యక్తిగత ఛాంపియన్‌గా ఈఈఈ విభాగానికి చెందిన విద్యార్థి దీక్షిత్ నిలిచాడు. మొత్తం రెండోరోజు 160మంది క్రీడాకారులు పోటీల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో రుద్రంపూర్ కళాశాల ప్రిన్సిపాల్ బండి శ్రీనివాస్, ఆర్గనైజింగ్ సెక్రెటరీ కృష్ణ పాల్గొన్నారు.

వలస కూలీల సందడి

- మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, ఒడిసా, బీహార్ రాష్ట్రాల నుంచి వలస కూలీల రాక
- వరినాట్లు, మిర్చికోతలతో బిజీ బిజీ, తక్కువ కూలి, నాణ్యమైన పని
- రెండు వ్యవసాయ సీజన్లకు మూడునెలల పాటు ఇక్కడే మకాం
- గిట్టుబాటు కూలి వస్తుండటంతో ఏటా పెరుగుతున్న వలస



కూసుమంచి మండలం కోక్యాతండాలో మిర్చి ఏరుతున్న వలస కూలీలు

కూసుమంచి, జనవరి 23(ఆంధ్రజ్యోతి): పాలేరు నియోజకవర్గ వ్యాప్తంగా ఒకవైపు వరినాట్లు, మరోవైపు మిర్చికోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. ఈక్రమంలో కూలీల కొరత ఏర్పడింది. ఇతర రాష్ట్రాలనుంచి వలస కూలీలను తీసుకోచ్చి పనులు చేయించుకుంటున్నారు. మహారాష్ట్ర, ఒడిషా, బీహార్, ఛత్తీస్‌గఢ్, బీహార్ రాష్ట్రాలనుంచి కూలీలు వస్తున్నారు.వానాకాలం, యాసంగి సీజన్లలో రెండు, మూడువేల మంది మూడునెలల పాటు ఇక్కడే మకాం వేస్తున్నారు. ఎక్కడ పనులు చేస్తే ఆప్రాంతంలోనే గుడారాలు వేసుకుని ఉంటున్నారు. ఉదయం 6గంటల నుంచి, సాయంత్రం 5గంటల వరకు మిర్చికాయలు కోస్తున్నారు. వరినాట్లు వేస్తున్నారు. ఒక్కో కుటుంబం 2క్వింటాళ్ల వరకు పత్తి తీస్తున్నారు. తెలంగాణలో పనులు ఎక్కువగా ఉంటుండటంతో ఎక్కువగా ఉపాధి నిమిత్తం ఏటా ఇక్కడకు వస్తున్నారు. సాగునీటి వనరులు పెరగడం, భారీవర్షాల కారణంగా జలవనరులు కళకళలాడుతండటంతో వ్యవసాయం పెరిగింది. ఫలితంగా స్థానికంగా కూలీల కొరత ఏర్పడింది. ప్రధానంగా వరినాటు వేసే యంత్రాలు ఉన్నప్పటికీ మెరుగైన ఫలితాలు ఇవ్వకపోవడంతో ఆయా గ్రామాల్లో ఇంకా కూలీలపైనే ఆధారపడి నాట్లు వేస్తున్నారు. స్థానిక కూలీలకంటే కూలీ ధర తగ్గడం పనులు వేగంగా పూర్తవుతున్నాయని రైతులు చెపుతున్నారు. వరినాట్లు, మిర్చికాయలు ఏరడం, పత్తితీత పనులు చకచకా అవుతుండటంతో ఎక్కువ మంది రైతులు వలస కూలీలనే ఆశ్రయిస్తున్నారు. వలస కూలీలు లేనిపక్షంలో ఇబ్బందులు తప్పవని చెపుతున్నారు. ఉపాధిహామీని వ్యవసాయానికి అనుసంధానం చేస్తే తమకు కొంత పెట్టుబడులు కూడా తగ్గుతాయని రైతులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

ఫౌంటేన్ నిర్మాణం చేపట్టాలి

భద్రాచలం ఐటీడీఏ పీవో రాహుల్

భద్రాచలం, జనవరి23(ఆంధ్రజ్యోతి): గిరిజన మ్యూజియం ప్రాంగణంలో ఫౌంటేన్ నిర్మాణం పనులు చేపట్టాలని భద్రాచలం ఐటీడీఏపీవో బి.రాహుల్ అన్నారు. గురువారం గిరిజన మ్యూజియం అభివృద్ధి పనులను ఆయన పరిశీలించారు. పర్యాటకులు సందర్శనకు వచ్చే పర్యాటకులు బోటింగ్, చిన్న పిల్లలు ఆడుకునే క్రీడాస్థలాలో విద్యుత్తు కాంతులతో పాటు కూర్చోడానికి బల్లలాంటివి ఏర్పాటు చేయాలని తెలిపారు. గిరిజన వంటకాల కోసం ఏర్పాటు చేసే స్థలాన్ని రేపటి వరకు శుభ్రం చేయాలని, పాతకాలపు ఇళ్లపైన తప్పనిసరిగా పేర్లు రాయించాలన్నారు. స్వాగత ద్వారం పక్కన ఖాళీ స్థలంలో డిజైన్‌గా ట్రైబల్ మ్యూజియం పేర్లు చెక్కించాలని అన్నారు. గిరిజన మ్యూజియం ఆవరణలో బాక్స్ క్రికెట్ ఏర్పాటుకు ఔత్సాహికులు ఈనెల 27న సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఏపీవో జనరల్ డేవిడ్‌రాజు, టి.శ్రీనివాస్, జేడీఎం హరికృష్ణ పాల్గొన్నారు.


అధికారులతో మాట్లాడుతున్న పీవో రాహుల్

గోళ్లపాడు చానల్‌పై అనుమతి లేని నిర్మాణాల కూల్చివేత

ఖమ్మంసంక్షేమవిభాగం, జనవరి23 (ఆంధ్రజ్యోతి): సెప్టెంబరు 1న మున్నేరుకు వచ్చిన వరద ముప్పుతో మున్నేరు పరివాహక ప్రాంతంతో పాటుగా గోళ్లపాడు ఛానల్‌పై నివాసాలు ఏర్పాటు చేసుకున్న వారు సైతం తీవ్రం ఆస్థి నష్టానికి గురయ్యారు. ఈ క్రమంలో వరద పరివాహకంలో ఉన్న ప్రజల్ని రెండు పడకల ఇళ్లు ఇచ్చి మైదాన ప్రాంతానికి తరలించాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కార్యచరణ చేస్తున్నారు. కాగా మరో వైపు గోళ్లపాడు చానల్‌లో ముంపు ప్రాంతాల్లో కొంతమంది అనాధికారికంగా నివాసాలు ఏర్పాటు చేసుకునేందుకు శాశ్విత కట్టడాలు ప్రారంభించారు. విషయం తెలుసుకున్న కమిషనర్ అభిషేక్ అగస్త్య పట్టణ ప్రణాళిక అధికారి వసుంధరకు ఆదేశాలిచ్చారు. దీంతో పట్టణ ప్రణాళిక అధికారులు గురువారం గోళ్లపాడు చానల్‌పై జరుగుతున్న అనుమతి లేని నిర్మాణాలను కూల్చి వేశారు.

క్రైం సమాచారం

తల్లిదండ్రులు మందలించారని యువకుడి ఆత్మహత్య

దుమ్ముగూడెం, జనవరి 23(ఆంధ్రజ్యోతి): పనిచేయకుండా ఇంటి వద్ద ఉండటాన్ని తల్లిదండ్రులు ప్రశ్నించి మందలించిన నేపథ్యంలో ఓ యువకుడు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. చినబండిరేవుకు చెందిన బాద దేవేందర్‌రెడ్డి(22) ముసలిమడుగు సమీపాన సీతవాగు వద్ద చెట్టుకు ఉరేసుకున్నాడు. ఇతడు గతంలో పలుమార్లు బ్లేడ్‌తో చేయికోసుకోవడం, క్రిమి సంహారక మందు తిని ఆత్మహత్యకు ప్రయత్నించాడు. కొద్దిరోజుల పాటు రాజుపేటలోని తాతయ్య ఇంటి వద్ద ఉన్న దేవేందర్‌రెడ్డి ఈనెల 22న తన ఇంటికి వచ్చాడు. అదే రోజు సాయంత్రం ఆరుగంటల సమయంలో ద్విచక్రవాహనం మీద బైటకు వెళ్లాడు. దేవేందర్‌రెడ్డి చెట్టుకు వేలాడుతూ ఉండడాన్ని ముసలిమడుగు గ్రామస్థులు గమనించి పోలీసులకు సమాచారమందించారు. ఎస్ఐ వెంకటప్పయ్య గురువారం కేసు నమోదు చేశారు.

భార్యపై వేధింపులు.. కేసు నమోదు

అశ్వారావుపేట రూరల్, జనవరి (ఆంధ్రజ్యోతి): భార్యను వేధిస్తున్న భర్తపై గురువారం వేధింపుల కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ యయాతిరాజు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని గుమ్మడివల్లికి చెందిన మారేశ్వరికి, కోయరంగాపురం గ్రామానికి చెందిన సురేశ్‌తో రెండేళ్ల క్రితం వివాహమైంది. సురేశ్ భార్యను అదనపు కట్నం తేవాలని, సంతానం లేదని వేధింపులకు గురిచేస్తున్నాడు. దీంతో కొద్దిరోజుల క్రితం వివాహిత పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఆసుపత్రిలో చికిత్స పొందిన తరువాత మారేశ్వరి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయటంతో భర్త సురేశ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ యయాతిరాజు తెలిపారు.

యువతి అదృశ్యం..

అశ్వారావుపేట రూరల్, జనవరి 23(ఆంధ్రజ్యోతి): యువతి అదృశ్యంపై గురువారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ యయాతిరాజు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని గుమ్మడివల్లి గ్రామానికి చెందిన 22 ఏళ్ల యువతి ఈనెల 20న రాత్రి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీనిపై యువతి తల్లి అశ్వారావుపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ యయాతిరాజు తెలిపారు.

గురుకుల కళాశాల విద్యార్థి అదృశ్యం

మధిర రూరల్, 23(ఆంధ్రజ్యోతి): మధిర సమీపంలోని కృష్ణాపురం గ్రామంలోగల మహాత్మ జ్యోతిబాపూలే గురుకుల కళాశాలలో ఇంటర్ చదివే విద్యార్థి అదృశ్యమయ్యాడని ప్రిన్సిపాల్ సుష్మ మధిర రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. బోనకల్ మండలం పల్లి గ్రామానికి చెందిన చల్లా మహేశ్వరరావు అనే విద్యార్థి గురుకుల కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్నాడు. బుధవారం మధ్యాహ్నం ఆ విద్యార్థిని తండ్రి కృష్ణ కళాశాలకు తీసుకువచ్చారు. అయితే సాయంత్రం కళాశాలలో పెట్టే పరీక్షల సమయం నుంచి ఈ విద్యార్థి కనిపించడం లేదు. కళాశాల సిబ్బంది ఎంత వెతికినప్పటికీ ఆచూకీ లభించలేదు. దీంతో ప్రిన్సిపాల్ సుష్మ మధిర రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. విద్యార్థి ఎవరికైనా కన్పిస్తే మధిర రూరల్ పోలీసులకు సమాచారం అందించాలని ఎస్ఐ లక్ష్మీభార్గవి తెలిపారు.

అనారోగ్యంతో అంగన్‌వాడీ ఆయా మృతి

కల్లూరు, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): కల్లూరు పట్టణంలోని అంగన్‌వాడీ నెం.8 కేంద్రంలో పని చేస్తున్న సిద్దం ద్రౌపది(48) అనారోగ్యంతో గురువారం మృతి చెందారు. సదరు కేంద్రం ఆయా మృతి చెందిన సమాచారంతో కల్లూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి నిర్మలజ్యోతి, కల్లూరు సెక్టార్ సూపర్‌వైజర్ సంధ్య, టీచర్ల, హెల్పర్ల సంఘం నాయకులు వాణి, పద్మ, హేమలత, రాజకుమారి, పలువురు ఆయాలు ద్రౌపది మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు సానుభూతి సంతాపం తెలిపారు.

చిన్నారి ప్రాణాలతో చెలగాటం

- భూత వైద్యం పేరుతో మోసం
- ప్రాణాపాయ స్థితిలో బాలిక
- వరంగల్‌కు తరలించిన తల్లిదండ్రులు


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ప్రవీణ

గుండాల, జనవరి 23(ఆంధ్రజ్యోతి): భూతవైద్యం పేరుతో ఏజెన్సీలో అమయాకులను ఆసరాగా చేసకొని అక్రమార్జనకు తెరలేపిన ఓ మాంత్రికుడి నిర్వాకంతో ఓ బాలిక ప్రాణాలు ప్రమాదంలో పడ్డాయి. భద్రాద్రి జిల్లా గుండాల మండలంలో జరిగిన ఈ ఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. గుండాల మండలం గలబ గ్రామానికి చెందిన ఓ వ్యక్తి గుండాల సమీపంలోని మఠంలంకలో నివాసం ఉంటున్నాడు. అతడికి ఏడేళ్ల వయస్సున్న కుమార్తె ఉండగా బాలిక ఆరోగ్యం బాగాలేకపోవడంతో ఈ నెల 5వ తేదీన ఇల్లెందు ఆసుపత్రికి తీసుకెళ్లేందుకు బయలుదేరాడు. ఈ క్రమంలో ఓ భూతవైద్యుడు అతడిని కలిసి చిన్నారికి పట్టిన పీడలను వదిలిస్తానని, ఆసుపత్రికి వెళ్లాల్సిన అవసరం లేదని నమ్మ బలకడంతో అతడు పాపను ఆసుపత్రికి తీసుకెళ్లలేదు. మరుసటిరోజు 6వ తేదీన ఓ మేకపోతును బలిఇచ్చి భూతాల కట్టడికి పూజచేశాడు. తరువాత మూడు రోజులైనా పాప ఆరోగ్యం మెరుగు పడకపోగా పరిస్థితి విషమించడంతో బాలిక తండ్రి భూత వైద్యుడిని నిలదీయడంతో భూతాల కట్టడికి వేసిన మంత్రం తీసివేస్తానని, పాపను ఆసుపత్రికి తీసుకెళ్లమని చెప్పడంతో 10వ తేదీన ఇల్లెందు పట్టణ ప్రాంతంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అయితే పాప ఆరోగ్యం క్షీణించిందని మెరుగైన వైద్యం అందించాలని అక్కడి వైద్య సిబ్బంది తెలిపారు. ప్రైవేటు ఆసుపత్రిలో వైద్య ఖర్చులు భరించలేక బాలికను వరంగల్ ఎంజీఎంకు తరలించి అక్కడ వైద్యం అందిస్తున్నారు. ప్రస్తుతం బాలిక ఆరోగ్యం నిలకడగా ఉందని తల్లిదండ్రులు తెలిపారు. ఆసుపత్రికి వస్తున్న తమను మధ్యలో కలిసి పాపకు నయం చేస్తామని నమ్మించి ఆర్థికంగా నష్టం చేయడమే కాకుండా ఆసుపత్రి పాలు చేశాడని బాలిక తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. అయితే ఈ ఘటనపై బాధిత కుటుంబ సభ్యులు పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు చేయలేదు. బాధితులు ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామని గుండాల పోలీసులు తెలిపారు.

కఠిన చర్యలు తీసుకుంటాం: రాజమౌళి, ఎస్ఐ

భూత వైద్యాలను నమ్మి ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దు. అనారోగ్యం భారిన పడితే వెంటనే సమీపంలోని వైద్యులను సంప్రదించాలి. భూత వైద్యం పేరుతో ఎవరైనా వస్తే వెంటనే సమాచారం ఇవ్వండి. భూత వైద్యం పేరిట ప్రజలను మోసం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం.

ఒక్క కాల్.. ముగ్గురి సేఫ్

- డయల్ 100 ఫిర్యాదుతో స్పందించిన పోలీసులు
- తల్లి, పిల్లలను కాపాడిన హెడ్ కానిస్టేబుల్

వైరా, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): డయల్ 100 ద్వారా తమకు వచ్చిన సమాచారంతో ఓ మహిళను, ఇద్దరు పిల్లలను వైరా పోలీసులు కాపాడారు. తన సోదరి తన ఇద్దరు పిల్లలతో కలిసి వైరా రిజర్వాయర్‌లో దూకి ఆత్మహత్య చేసుకునే అవకాశం ఉందని ఆమె సోదరి పోలీసులుకు డయల్ 100 ద్వారా సమాచారం ఇచ్చింది. ఆవెంటనే స్థానిక హెడ్‌కానిస్టేబుల్ కృష్ణమూర్తి హుటాహుటిన వైరా రిజర్వాయర్ ఆనకట్టకు చేరుకొని అక్కడున్న వివాహిత ఆమె ఇద్దరు పిల్లలను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. గురువారం మధ్యాహ్నం వైరాలో ఈ సంఘటన చోటుచేసుకుంది. అయితే సదరు బాదితురాలు తన వివరాలు వెల్లడించేందుకు నిరాకరించింది. తాను పిల్లలతో కలిసి ఎలాంటి అఘాయిత్యానికి పాల్పడే ప్రయత్నం చేయలేదని చెప్పుకొచ్చింది.

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాపకొల్లుకు చెందిన యువతిని తల్లాడ మండలం అన్నారుగూడెం గ్రామానికి చెందిన ఒక యువకుడికి ఇచ్చి వివాహం చేశారు. ఆదంపతులకు ఎనిమిదేళ్ల కుమారుడు, ఆరేళ్ల కుమార్తె ఉన్నారు. రెండేళ్ల కిందట బార్యభర్తల మధ్య విభేదాలు ఏర్పడ్డాయి. దాంతో ఆ వివాహిత తన ఇద్దరు పిల్లలతో కలిసి కొణిజర్ల మండలం గుబ్బగుర్తిలోని తమ సోదరి దగ్గర ఉంటూ టైలరింగ్ ఇతర పనులు చేసుకొని జీవిస్తోంది. బుధవారం సాయంత్రం ఆమె భర్త, అత్త, ఆడపడుచులు మరికొంతమంది బంధువులు గుబ్బగుర్తి వెళ్లి కుటుంబ కలహాలు మర్చిపోయి అన్నారుగూడెం రావాలని కోరారు. దాంతో గుబ్బగుర్తిలోని సోదరి తమ తోబుట్టువుకు నచ్చజెప్పి పిల్లలతో సహా అందరిని భర్త, వచ్చిన బంధువుల వెంట అన్నారుగూడెం పంపించింది. అక్కడకు వెళ్లిన తర్వాత కూడా భర్త సఖ్యతగా ఉండకపోవడంతో గురువారం అన్నారుగూడెం నుంచి తన సెల్‌ఫోన్ వాట్సప్ స్టేటస్‌లో తాను పిల్లలతో కలిసి ఆత్మహత్య చేసుకుంటామని సమాచారం ఉంచింది. ఆస్టేటస్ చూసిన ఆమె సోదరి వెంటనే డయల్ 100ద్వారా పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు వెంటనే రిజ.ర్వాయర్ వద్దకు చేరుకొని అక్కడున్న తల్లీ పిల్లలను పోలీస్‌స్టేషన్‌కు తీసుకువచ్చి కౌన్సిలింగ్ ఇచ్చారు. ఆతర్వాత వారిని బంధువులకు అప్పగించడంతో కథ సుఖాంతమైంది.

ఎర్నేని రామారావుపై పరువు నష్టం దావా

ఖమ్మం లీగల్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం కమ్మ మహాజనసంఘం మాజీ అధ్యక్షుడు ఎర్నేని రామారావు, ఉపాధ్యక్షుడు ప్రధానకార్యదర్శి గొడవర్తి నాగేశ్వరరావు, కోశాధికారి నల్లమోతు రఘుపతిరావుపై ఖమ్మం జిల్లా కోర్టులో రూ.50 లక్షలకు ఆ సంఘం మాజీ మేనేజర్ కామినేని రవి పరువునష్టం దావా దాఖలువేశారు. దావాను విచారణకు స్వీకరించిన న్యాయస్థానం ఓఎస్/07/2025గా నెంబరు కేటాయించి ప్రతివాదులకు నోటీసులు జారీచేసింది. తదుపరి విచారణను ఫిబ్రవరి 12కు వాయిదావేసింది. కేసు వివరాల ప్రకారం 2005 ఏప్రిల్ 1 నుంచి 2023 సెప్టెంబరు 30 వరకు ఖమ్మం కమ్మ మహాజనసంఘం మేనేజరుగా కామినేని రవి పనిచేసేవారు. ఎర్నేని రామారావు అధ్యక్షుడిగా ఎన్నికైన తరువాత ఆ సంఘానికి సంబంధించిన ఆర్థిక లావాదేవీలు మూడు బ్యాంకుల్లో డిపాజట్లుగా ఉన్న నగదు నిల్వలను 90శాతం మేర తన స్తంభాద్రి కోఆపరేటీవ్ అర్బన్ బ్యాంకులో డిపాజిట్ చేయాలని చెప్పగా మేనేజర్ రవి అందుకు అంగీకరించలేదు. 2023 సెప్టెంబరు 30న కామినేని రవి తన పదవికి రాజీనామా చేశారు. అనంతరం 2023 అక్టోబరు 8న ఆ సంఘానికి సంబంధించిన అన్ని ఆర్థిక లావాదేవీలను రశీదులతో సహా కోశాధికారికి అప్పగించారు. 11 నెలల తరువాత మేనేజర్ రవి రూ.1,36,822 బాకీ ఉన్నట్లు నోటీసులు ఇచ్చారు.

సదరు బాకీని ఆడిట్ రిపోర్టు వార్షిక బడ్జెట్‌లో చూపకుండా సంఘానికి సంబంధించిన పుస్తకంలో ముద్రించి సభ్యులకు పంపిణీచేశారు. దీనిపై వారికి లీగల్ నోటీసులు జారీచేసినా స్పందించకపోవడంతో న్యాయవాదులు గొల్లపూడి రామారావు, కిలారు లక్ష్మీనర్సింహారావు ద్వారా ఖమ్మం జిల్లా కోర్టులో అధ్యక్ష కార్యదర్శులతోపాటు కోశాధికారిపై పరువు నష్టం దావా దాఖలుచేశారు.


ఖమ్మం జిల్లా జైలును పరిశీలిస్తున్న సీపీ సునీల్‌దత్

జిల్లా జైలును సందర్శించిన సీపీ

ఖమ్మంక్రైం, జనవరి23 (ఆంధ్రజ్యోతి): నగర పరిధిలోని రామన్నపేట సమీపంలోని జిల్లా జైలును పోలీసు కమిషనర్ సునీల్‌దత్ గురువారం సందర్శించారు. ఈసందర్భంగా జిల్లా జైలు సూపరింటెండెంట్ శ్రీధర్ సీపీకి మొక్కను అందించి స్వాగతంపలికారు. ఈసందర్భగా జైలులోని అన్ని బ్లాకులను పరిశీలించి ఖైదీలతో సీపీ మాట్లాడారు. జైలులో నిరక్షరాస్యత ఖైదీలకు సంతకం , అక్షరమాల నేర్పించడం చూసి సిబ్బందిని అభినందించారు. కారాగార భద్రతకు సంబంధించి అన్ని విషయాలు పరిశీలించి కారాగారంలోని పచ్చదనం, బాగుందని ప్రశంసించారు. ఈకార్యక్రమంలో జైలు సూపరిటెండెంట్ ఎ. శ్రీధర్, ఏఆర్ ఏసీపీ సుశీల్‌సింగ్, జైలు అధికారి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



డైమండ్ జూబ్లీ జంబోరీకి శ్రీనివాస్

ఖమ్మంస్పోర్ట్స్‌జనవరి 23(ఆంధ్రజ్యోతి): భారత్ స్కౌట్స్‌అండ్‌గైడ్స్ ఏర్పడి 75 సంవత్సరాలు నిండిన సందర్భంగా ఈనెల 28 నుంచి ఫిబ్రవరి3వరకు తిరుచ్చిలో జరిగే డైమండ్‌జూబ్లీ జంబోరీకి నగరానికి చెందిన నేషనల్‌హెడ్ క్వార్టర్స్ కమిటీ మెంబర్ శ్రీనివాస్‌కు అహ్వానం అందింది. వారం పాటు జరిగే జంబోరీ ఉత్సవాల్లో దేశ వ్యాప్తంగా సుమారు 40వేలమంది స్కౌట్స్ అండ్ గైడ్స్ పాల్గొననున్నారు.

సెమీస్ దశకు ఎస్‌జీఎఫ్ బాలికల క్రికెట్ పోటీలు

ఖమ్మంస్పోర్ట్స్‌జనవరి23(ఆంధ్రజ్యోతి): నగరంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో రెండు రోజులుగా జరుగుతున్న స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్రస్థాయి అండర్-17 బాలికల క్రికెట్ పోటీలు సెమీస్ దశకు చేరుకున్నాయి. పూల్ ఎ నుంచి రంగారెడ్డి, మెదక్ జట్లు సెమీస్‌కు చేరుకోగా, పూల్ బి నుంచి ఖమ్మం, మహబూబ్‌నగర్ జట్లు సెమీస్‌కు చేరుకున్నాయి.తుదిపోటీలు శుక్రవారం నిర్వహించనున్నారు.

ఒకేసారి 40మందితో పారిశుధ్య పనులు



ఖమ్మంసంక్షేమవిభాగం, జనవరి23 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగరంలోని ప్రధానమైన బహిరంగ ప్రదేశాల్లో ఖమ్మం నగర పాలక సంస్థ పారిశుధ్య విభాగం స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. గురువారం 40 మంది కార్మికులను ఒకేసారి ప్రభుత్వ డిగ్రీ కాలేజీ మైదానం, వాకర్స్ గ్రౌండ్ నుంచి జూబ్లీక్లబ్, ఎంఆర్వో కార్యాలయాల నుంచి కలెక్టర్ క్యాంపు కార్యాలయం వరకు ప్రత్యేక పారిశుధ్య పనులు చేపట్టారు.

కవి సవ్యసాచికి గిడుగు రామమూర్తి పురస్కారం



పురస్కారం అందుకుంటున్న సవ్యసాచి

ఖమ్మంసాంస్కృతికం,జనవరి23 (ఆంధ్రజ్యోతి): జిల్లాకు చెందిన కవి సవ్యసాచి గిడుగు రామమూర్తి సాహిత్య జాతీయ పురస్కారం అందుకున్నారు. బుధవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో సాహితీవేత్త బిక్కికృష్ణ ఆయనను శాలువాతో సత్కరించి అవార్డును ప్రదానం చేశారు. అనువాదసాహిత్యంలో సవ్యసాచి చేస్తున్న కృషికి గానూ ఈపురస్కారం దక్కింది. తెలుగు కవిగానే కాక తెలుగు నుండి ఆంగ్ల భాషలోకి అనేక కవితలను అనువదించారు. ఖమ్మంలోని భద్రాద్రి బ్యాంకులో ఆయన మేనేజర్‌గా పనిచేస్తూనే సాహిత్యంలో విశేష కృషి చేస్తున్నారు.





దరఖాస్తులు స్వీకరిస్తున్న కార్పొరేటర్ పాలేపు విజయవెంకటరమణ, మంగలగూడెంలో అధికారులను నిలదీస్తున్న గ్రామస్తులు

ముగిసిన ప్రజాపాలన డివిజన్ సభలు

- మూడు రోజుల్లో 60డివిజన్లు పూర్తి
- ఊపిరిపీల్చుకున్న కేఎంసీ పాలకవర్గం
- పాలేరు నియోజకవర్గంలో నిరసన హోరు

ఖమ్మంసంక్షేమవిభాగం,జనవరి23(ఆంధ్రజ్యోతి):ఇందిరమ్మఇళ్లు, కొత్తరేషన్‌కార్డులు, రేషన్‌కార్డుల్లో మార్పులు చేర్పులు, ఇందిరమ్మ భరోసా, రైతుభరోసా, ఇతర సంక్షేమ పథకాల కోసం చేపట్టిన ప్రజాపాలన గ్రామసభలు గురువారంతో ముగిశాయి. మూడురోజుల్లో 60 డివిజన్ల బహిరంగ సభలు ప్రశాంతంగా ముగియటంతో ఖమ్మం నగర పాలక వర్గం ఊపిరి పీల్చుకొంది. గతంలో ప్రజాపాలన కార్యక్రమంలో ఇందిరమ్మ ఇళ్లకు దరఖాస్తులు చేసిన వారు సమగ్ర కుటుంబ సర్వేలో రేషన్‌కార్డుల లేవని చెప్పిన వారి పేర్లు జాబితాలో లేక పోవటంతో మరోసారి ప్రజలు దరఖాస్తులు చేసుకోవాల్సి వచ్చింది. ఖమ్మం మేయర్ పునుకొల్లు నీరజ ప్రతిరోజు మూడు డివిజన్ సభల్లో పాల్గొని ప్రజలకు భరోసా కల్పించారు. ఖమ్మం విలీన డివిజన్ ప్రాంతాల ప్రజలు సంక్షేమ పథకాల కోసం కొంతగొడవలు చేశారు. కమిషనర్ అభిషేక్ అగస్త్య డివిజన్ సభలను పర్యవేక్షణ చేస్తూ ఎప్పటికప్పుడు అధికారయంత్రాంగానికి మార్గదర్శకం చేశారు. పట్టణ ప్రణాళిక అధికారి వసుంధర, రెవెన్యూ అధికారి జీ.శ్రీనివాసరావు, ఉద్యాన అధికారి బెల్లం రాధిక, ఏవో శివలింగం, పారిశుధ్య పర్యవేక్షకులు సాంబయ్య ప్రత్యేక అధికారులుగా వ్యవహరించి సభలను దిగ్విజయంగా పూర్తి చేశారు.

మంత్రి తుమ్మల కృషితో అందరికీ పథకాలు

వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చొరవతో ఖమ్మంలో అర్హత కలిగిన అందరికి సంక్షేమ పథకాలు అమలు జరుగుతాయని మేయర్ పునుకొల్లు నీరజ పేర్కొన్నారు. గురువారం ఖమ్మం నగరంలోని 46, 50వ డివిజన్ ప్రజాపాలన బహిరంగ సభల్లో మేయర్ సంక్షేమ పథకాలను వివరించారు. అలాగే 44వ డివిజన్‌లో భక్తరామదాసు కళాక్షేత్రంలో డివిజన్ సభలను నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ పాలేపు విజయవెంకటరమణ మాట్లాడుతూ ఇందిరమ్మ రాజ్యంలో సంక్షేమ పథకాలు ప్రతీ కుటుంబానికి అందుతున్నాయని భరోసా ఇచ్చారు. 49వ డివిజన్‌లో కార్పొరేటర్ దుద్దుకూరి వెంకటేశ్వర్లు, 50వ డివిజన్‌లో కార్పొరేటర్ రాపర్తి శరత్‌కుమార్ ఆధ్వర్యంలో డివిజన్ సభలను నిర్వహించారు.

గ్రామకార్యదర్శిపై ఆగ్రహం

తిరుమలాయపాలెం: మండలంలోని లక్ష్మీదేవిపల్లితండా పంచాయతీ కార్యదర్శి ప్రణతిని గ్రామస్తులు గురువారం నిర్బంధించారు. గ్రామసభలో జాబితాలో పేర్లు లేవంటూ దానికి మీరేకారకులంటూ ప్రజలు సుమారు పదిమంది ఆమెను విధులునిర్వహిస్తుండగా విధులకు ఆటంకం కలిగించారు. దీంతో పంచాయతీ కార్యదర్శి తహసీల్దార్‌కు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు అక్కడకు వెళ్లి విచారణ చేపట్టారు. ఈవిషయమై పోలీసుస్టేషన్‌లో పంచాయతీ కార్యదర్శి ఫిర్యాదు చేశారు.

నిరసనల మధ్య గ్రామసభలు

తిరుమలాయపాలెం:మండలంలోని7 గ్రామపంచాయతీలో గ్రామసభలు నిర్వహించారు.రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసాలో తమపేర్లు లేవని పలువురు నిరసన తెలిపారు దమ్మాయిగూడెం, సుబ్లేడు, చంద్రుతండా, సోలిపురం తదితర గ్రామాల్లో జరిగిన గ్రామసభల్లో రేషనకార్డులు, ఇందిరమ్మఆత్మీయభరోసా,ఇందిరమ్మ ఇళ్ల జాబితాను అధికారులు ప్రకటించడంతో తమ పేర్లు లేవని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఇళ్ల లబ్ధిదారుల ఎంపికలో అనర్హులకు వచ్చాయని, ధనవంతులకు వచ్చాయని వీటిపై సమగ్ర విచారణ జరిపాలని అధికారులను నిలదీశారు.

ప్రతిపక్షాలతో కలిసి కాంగ్రెస్ నిరసన

నేలకొండపల్లి: రెండు రోజుల పాటు దాదాపుగా ప్రశాంతంగానే జరిగిన గ్రామసభలు మూడోరోజు మాత్రం గందరగోళానికి దారితీసాయి. లబ్ధిదారుల ఎంపికలో అవకతవకలు జరిగాయని, అనర్హులకే పెద్దపీట వేశారని ఆరోపిస్తూ దాదాపు గురువారం జరిగిన అన్ని గ్రామసభల్లో అధికారులను నిలదీశారు. చెర్వుమాధారంలో టెంటును కూల్చేసారు. ముజ్జుగూడెంలో దాదాపుగా చేతులు కలిసే దాకా పరిస్థితులు వెళ్లాయి. నేలకొండపల్లి గ్రామసభలో బీఆర్ఎస్, సీపీఎంలతో కాంగ్రెస్‌లు జతకలవటం గమనార్హం. నేలకొండపల్లిలో లబ్ధిదారుల లిస్టును చదివిన అనంతరం ఒక్కసారిగా గందరగోళం తలెత్తింది. తన కుటుంబంలో అన్ని అర్హతలున్నా ఏ పథకం వర్తించలేదని ఆరోపిస్తూ ఇటీవలనే ఓగుడికి చైర్మన్‌గా నియమితుడైన కాంగ్రెస్ నాయకుడు అధికారులను నిలదీయటం గమనార్హం. చెర్వుమాధారంలో ఓదశలో గ్రామసభలో వేసిన టెంటు కూలిపోయింది. పోలీసులు సర్దిచెప్పి గందరగోళాన్ని ఆపారు. ముజ్జుగూడెంలో పుచ్చకాయల నర్సింహారావు తొలుత అధికారులతో వాగ్వాదానికి దిగాడు.అనంతరం కాంగ్రెస్ నాయకులపైకి దూసుకెళ్లాడు. ఒక ప్లాను ప్రకారం బీఆర్ఎస్ నాయకులు తొలుత తమ పైకి దళితులను ఎగదోసారని, దళితులే ఎదురు తిరిగేసరికి వెనక్కి తగ్గారని కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు. ఓదశలో చేతులు కలిసే దాకా పరిస్థితులు వెళ్లాయంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. లక్ష్మీనర్సయ్య, బ్రహ్మయ్యలు వారి,వారి పార్టీల కార్యకర్తలకు సర్ది చెప్పుకుని గొడవలను ఆపారు. పైనంపల్లిలో బీఆర్ఎస్ నాయకులు అధికారులకు వినతిపత్రం అందచేశారు.

భూస్వాములకు పథకాలా ?

ఖమ్మంరూరల్: ఖమ్మం రూరల్ మండలంలోని తల్లంపాడు, మంగళగూడెం, తెల్దారుపల్లి, తదితర గ్రామాల్లో బుధవారం గ్రామ సభలు నిర్వహించారు. గ్రామసభల్లో లిస్టులో ఉన్న పేర్లు చదువుతుండగా భూస్వాములకు, అనర్హులకు, బీఆర్ఎస్ పార్టీకి చెందిన వారికి మాత్రమే లిస్టులో పేర్లు రావడం ఏమిటని అధికారులను నిలదీశారు. తల్లంపాడు, మంగళగూడెం గ్రామాల్లో బీఆర్ఎస్‌కి చెందిన వారికి పథకాలు అందించడమేనే ఇందిరమ్మ రాజ్యం అంటే ఇదేనా అంటూ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పెద్ద సంఖ్యలో భూములు ఉన్నవారికి, ప్రభుత్వ ఉద్యోగం ఉన్న వారి కుటుంబాల వారికి ఇందిరిమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు ఇవ్వడం ఏమిటని అధికారులను ప్రశ్నించారు. ధనికులైతే వారి పేర్లు తొలగించడం జరుగుతుందని పేర్లు రాని వారు ఆందోళన చెందాల్సిన పనిలేదని దరఖాస్తు చేసుకోవాలని సూచించడంతో ప్రజలు శాంతించారు.

రేపు రెవెన్యూ మేళా

- ఖమ్మం నగర పాలక సంస్థలో నిర్వహణ
- ఇంటి నెంబర్లు సవరణ నుంచి కుళాయి సమస్యలు, ఫిర్యాదుల స్వీకరణ
- వారంలో పరిష్కారానికి కృషి
- కమిషనర్ అభిషేక్ అగస్త్య



ఖమ్మంసంక్షేమవిభాగం, జనవరి23 (ఆంధ్రజ్యోతి): ప్రజాపాలన డివిజన్ బహిరంగ సభలు పూర్తి కావటంతో ఖమ్మం నగర పాలక సంస్థ అధికారులు ఇక రెవెన్యూ సమస్యల పరిష్కారంపై దృష్టి సారించారు. ప్రతీ సోమవారం నిర్వహించే ప్రజావాణిలో 60శాతం మేరకు రెవెన్యూ విభాగానికి సంబంధించిన వినతులను ప్రజలు అందిస్తున్నారు. రెవెన్యూ సిబ్బంది క్షేత్రస్థాయిలో ఆదాయ వసూళ్ల(ట్యాక్స్ కలెక్షన్)కు వెళ్లిన సమయంలో చిన్న చిన్న సమస్యలను చూపి కొంతమంది తమ ట్యాక్స్‌లను చెల్లించకుండా కొర్రిలు పెడుతున్నారు. వారం రోజుల్లో ఇటువంటి సమస్యలు అధికంగా వచ్చాయి. దీంతో స్పందించిన కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య ప్రత్యేక రెవెన్యూ మేళా కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈనెల25న ఖమ్మం నగర పాలక సంస్థ కార్యాలయంలో ఉదయం 10.30 నుంచి రెవెన్యూ విభాగంపై ఫిర్యాదులను స్వీకరించనున్నారు. శనివారం నుంచి తిరిగి శనివారం లోగా రెవెన్యూ మేళాలో వచ్చిన వినతులు, ఫిర్యాదులను పరిష్కరించనున్నారు. ఇందుకోసం రెవెన్యూ డివిజన్లు వారిగా సిబ్బందిని ఏర్పాటు చేసి రెవెన్యూ మేళాకు పిలుపునిచ్చారు..

ప్రధానమైన సమస్యలు

ఖమ్మంనగరంలో 86వేల భవనాలు ఉన్నాయి. వీటిలో కమర్షిల్ భవనాలు 6 వేలు, నివాస మరియు కమర్షియల్‌తో 9వేలు భవనాలు ఉన్నాయి. 71వేల నివాసాలు నమోదు జరిగాయి. ఆయా కమర్షియల్ భవనాలు, నివాసాలకు రెవెన్యూ విభాగంలో తప్పుగా రికార్డులో నమోదు జరిగాయి. వాటిలో రెవెన్యూ తప్పులు సవరణ, ఇంటి నెంబర్‌లో సవరణలు, ఇంటి పన్ను నమోదులో తప్పులు, అధికంగా ఇంటి పన్ను నమోదు, ఒకే ఇంటికి రెండు నెంబర్లు కేటాయింపులు, తాగునీటి కుళాయి సమస్యలు, నీటి పంపులు లేకున్న బిల్లులు రావటం వంటి రెవెన్యూ సమస్యలు పరిష్కారానికి రెవెన్యూ మేళాలో ఫిర్యాదులు స్వీకరించనున్నారు. ఈ మేరకు కమిషర్ అగస్త్య కార్యాచరణ రూపొందించారు.

మా జీవితాలను చీకటిలోకి నెట్టవద్దు

జిల్లా హిజ్రా అసోసియేషన్ అధ్యక్షురాలు దోమల మేరి

ఖమ్మంచర్చికాంపౌండ్, జనవరి23(ఆంధ్రజ్యోతి): మాజీవితాలను చీకటిలోకి నెట్టకుండా కాపాడాలని జిల్లా హిజ్రా అసోసియేషన అధ్యక్షురాలు దోమల మేరి ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఎక్కడ ఏ తప్పు జరిగినా, దానికి మమ్ములను బాధ్యులను చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జీవనోపాధి కోసం భిక్షాటన చేసుకంటూ జీవించే వ్యక్తులము తప్ప దొంగతనాలకు, ఇతర అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడడంలేదని తెలిపారు. కుటుంబాలకు, సమాజానికి దూరమై బతుకుతున్నామని, ఇప్పుడిప్పుడే సమాజంలో గుర్తించబడుతున్నామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో జిల్లా వైస్‌ప్రెసిడెంట్ సీహెచ్ సోని, మాధురి, రూప నాగమణి పాల్గొన్నారు.

కృష్ణారావుకు కాంగ్రెస్‌కు సంబంధం లేదు

- కాంగ్రెస్ నాయకులు గుడిమళ్ల, బొల్లినేని



మాట్లాడుతున్న మూటాపురం గ్రామ కాంగ్రెస్ నాయకులు

నేలకొండపల్లి, జనవరి23(ఆంధ్రజ్యోతి):రావెళ్ల కృష్ణారావుకు మూటాపురం గ్రామం తో గానీ, కాంగ్రెస్ పార్టీతో గానీ ఎటువంటి సంబంధం లేదని మూటాపురం గ్రామానికి చెందిన మండల కాంగ్రెస్ నాయకులు గుడిమళ్ల మధు, బొల్లినేని వెంకన్న ప్రకటించారు. గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులతో కలిసి గురువారం మూటాపురంలో మధు ఇంట్లో విలేకరుల సమావేశం నిర్వహించారు. గతంలోనే కాంగ్రెస్‌తో కృష్ణారావుకు సంబంధం లేదని ప్రకటించినప్పటికీ, అతను మంత్రి బుధవారం గ్రామానికి వచ్చిన సందర్భంలో వచ్చి చికాకులు చేశాడన్నారు.గ్రామసభలో సైతం ప్రతిపక్ష పార్టీల వారితో చేతులు కలిపి గొడవకు కారకుడయ్యాడన్నారు. కృష్ణారావుకు కాంగ్రెస్‌తో ఎటువంటి సంబంధం లేదని, ఈవిషయాన్ని జిల్లా నాయకులకు, మంత్రి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జి తుంబూరు దయాకర్‌రెడ్డికి సైతం తెలిపామన్నారు. ఇంకోసారి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ విషయాల్లో జోక్యం చేసుకుంటే సహించబోమని హెచ్చరించారు. సమావేశంలో గుడిమళ్ళ మధు, బొల్లినేని వెంకటేశ్వర్లు, చావా కోటయ్య, ఏలూరి సురేష్, భూక్యా లక్ష్మణ్, చావా కృష్ణమూర్తి, ఏలూరి హనుమంతరావు,,బెల్లం శ్రీనివాస్ పాల్గొన్నారు.

నేతాజీ జయంతి వేడుకలు



ఖమ్మంబైపాస్‌రోడ్, జనవరి23(ఆంధ్రజ్యోతి): బీజేపీ ఆధ్వర్యంలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతిని గురువారం జిల్లా పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. స్వాతంత్ర పోరాటంలో నేతాజీ కృషి ఎనలేనిదని, నేతాజీ పోరాట పటిమను భారతజాతి స్ఫూర్తిగా తీసుకోవాలని జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో రాష్ట్ర నాయకులు సన్నె ఉదయ్‌ప్రతాప్, బైరెడ్డిప్రభాకరరెడ్డి, గంటేల విద్యాసాగర్, శ్యాంరాథోడ్, రవికుమార్, రాష్ట్ర నాయకుడు డాక్టర్ శీలం పాపారావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా లోకేష్ జన్మదిన వేడుకలు



రాజరాజేశ్వరి దేవాలయంలో పూజలు



టీడీపీ కార్యాలయంలో వేడుకలు

ఖమ్మంమామిళ్లగూడెం, జనవరి23 (ఆంధ్రజ్యోతి): టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి మాజీ మంత్రి నారా లోకేష్‌బాబు 42వ జన్మదిన వేడుకలను గురువారం టీడీపీ కార్యాలయంలో నిర్వహించారు. పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి కేతినేని హరీష్‌చంద్ర ఆధ్వర్యంలో కేక్‌కట్ చేసి స్వీట్లు పంచిపెట్టారు. యువగళం ద్వారా ఆంధ్ర రాష్ట్రంలో టీడీపీ సత్తాను చూపారని అన్నారు. ఈ కార్యక్రమంలో కన్నేటి పృథ్వి, నాంగడ్ల లక్ష్మణ్, మల్లెంపాటి రాము, చంద్రరవి, చింతనిప్పు నాగేశ్వరరావు , తాళ్లూరి నారాయణ, అంబడిపూడి లెనిన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు

గురువారం ఖమ్మం రోటరీనగర్‌లోని శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి దేవాలయంలో టీడీపీ నాయకులు ప్రత్యేక పూజలను నిర్వహించారు. నారాలోకేష్, బ్రాహ్మణి, దేవాన్ష్ పేరుతో అమ్మవారి గుడిలో పూజలునిర్వహించారు. అనంతరం భక్తులకు పండ్లు, పులిహోర పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో లీగల్‌సెల్ రాష్ట్ర నాయకులు మల్లెంపాటి అప్పారావు, నాయకులు కొండబాల కరుణాకర్, మహిళా నాయకురాలు రాజరాజేశ్వరి,రాయలకోటేశ్వరరావు, పాలడుగు క్రిష్ణప్రసాద్, గుండపునేని నాగేశ్వరరావు, పద్మనాభుల నారాయణరావు,నల్లమోతు సత్యనారాయణ, చావా రామారావు, చావా అజయ్, కొండపల్లి కిషోర్, కర్నాటి అశ్వనీకుమార్, మల్లెంపాటి లహరిన్, తుమ్మలపల్లి మోహన్ రావు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు రాజ్యాంగంపై గౌరవం లేదు

బీజేపీ రాష్ట్ర నాయకుడు బైరెడ్డి ప్రభాకర్‌రెడ్డి

ఖమ్మంబైపాస్‌రోడ్, జనవరి23(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీకి భారత రాజ్యాంగం పట్ల, అంబేద్కర్ పట్ల గానీ సరైన గౌరవం లేదని బీజేపీ రాష్ట్ర నాయకుడు బైరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఆరోపించారు. నగరంలోని జిల్లా బీజేపీ కార్యాలయంలో గురువారం మధ్యాహ్నం సన్నిధాన్ గౌరవ్ అభియాన్ కార్యక్రమాన్ని జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈసందర్భంగా ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ అంబేద్కర్ మృతి చెందినప్పుడు ఆయన భౌతిక కాయానికి ఢిల్లీలో అంత్యక్రియలు నిర్వహించకుండా ఎవరు అడ్డుకున్నారో ప్రజలకు తెలుసని,అదేవిధంగా అంబేద్కర్ స్మారకచిహ్నం నిర్మాణాన్ని ఎవరు కాదన్నారో ప్రజలకు తెలుసున్నారు. 1952 లోక్‌సభ ఎన్నికల్లో అంబేద్కర్‌ను ఓడించాలని నాటి కాంగ్రెస్ పార్టీ కమ్యూనిస్టు పార్టీలు కలిసి అంబేద్కర్ ఓటమికి కారకులయ్యారని ఆరోపించారు. ఈకార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడుగల్లా సత్యనారాయణ, రాష్ట్ర నాయకులు సన్నె ఉదయ్‌ప్రతాప్,గంటేల విద్యాసాగర్, ఈవీ రమేష్, శ్యాంరాథోడ్, రవికుమార్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు డాక్టర్ శీలంపాపారావు, మంద సరస్వతి, ఉపేందర్‌గౌడ్, రవి రాథోడ్, పాల్గొన్నారు.

స్నేహితుడి కుటుంబానికి ఆర్థికసాయం



ఆర్థికసాయం అందిస్తున్న మిత్రులు

కూసుమంచి, జనవరి 23(ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో మృతిచెందిన స్నేహితుడి కుటుంబానికి ఆపత్కాలంలో తామున్నామంటూ.. ఆర్థిక భరోసా ఇచ్చారు సహచర మిత్రులు... కూసుమంచి మండలం మల్లేపల్లి ఉన్నత పాఠశాలలో 2003లో టెన్త్ బ్యాచ్‌కు చెందిన వీరాస్వామి అనే వ్యక్తి ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. నిరుపేద కుటుంబం కావడంతో తోటిమిత్రులు అందరూ కలిసి పిల్లల ఉన్నత చదువుల నిమిత్తం సుమారు.రూ.80వేలు సేకరించారు. వీరాస్వామి కుటుంబానికి తమ గురువు తాళ్లూరి చంద్రశేఖర్ ద్వార అందజేశారు. ఏసమస్య వచ్చిన తాము అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

25,26 తేదీల్లో వైఎంసీఏ క్రీడలు

ఖమ్మం సాంస్కృతికం, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) యంగ్‌మెన్స్ క్రిష్టియన్ అసోసియేషన్ (వైఎంసీఏ) సాంస్కృతిక సంస్థ యూత్‌ఫెస్టివల్‌లో భాగంగా ఈనెల 25,26 తేదీల్లో జిల్లాస్థాయి ఇన్విటేషన్ వాలీబాల్ పోటీలు నిర్వహించనున్నట్లు వైఎంసీఏ అధ్యక్షుడు నగర కార్పొరేటర్ బీజీ క్లైమెంట్ తెలిపారు. గురువారం తుమ్మల గడ్డలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఈ వివరాలు వెల్లడించారు.

నల్లమలను అభినందించిన బాలకృష్ణ

ఖమ్మంమామిళ్లగూడెం, జనవరి23(ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగరంలో అన్నక్యాంటీన్ ద్వారా నిత్యంఅన్నదానం చేస్తున్న టీడీపీ నాయకుడు, బాలకృష్ణ అభిమాని నల్లమల రంజిత్‌ను సినీనటుడు, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ అభినందించారు. అనంతపురంలో జరిగిన డాకు మహారాజు విజయోత్సవంలో నందమూరి బాలకృష్ణను నల్లమల మర్యాదపూర్వకంగా కలిశారు. బాలకృష్ణను కలిసిన వారిలో బాలకృష్ణ ఫ్యాన్స్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు తాళ్లూరి శ్రీనివాస్ చౌదరి, సతీష్, గోపి పాపారావు, వెంకన్న, సురేష్, జైపాల్ ఉన్నారు.

సంక్షేమ పథకాలు నిరంతరం

ఖమ్మం ఏఎంసీ చైర్మన్ యర్రగర్ల



నిరసనకారులకు నచ్చజెపుతున్న చైర్మన్ యర్రగర్ల

రఘునాథపాలెం, జనవరి23(ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ రాజ్యాంతో ఇంటింటికి సంక్షేమ పథకాలు అందుతాయని ఖమ్మం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ యర్రగర్ల హనుమంతరావు ప్రజలకు హామి ఇచ్చారు. గురువారం రఘునాథపాలెం వీ వెంకటాయపాలెంలో నిర్వహించిన ప్రజాపాలన గ్రామసభలో ఆయన ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ప్రజాపాలన దరకాస్తుల తీరును పరిశీలించారు. మాజీ సర్పంచి కాపా ఆదినారాయణ, సొసైటీ వైస్ చైర్మన్ రావెళ్ల శ్రీనివాసరావు, గ్రామశాఖ అధ్యక్షుడు సురేశ్, సీపీఐ మండల కార్యదర్శి నాయుడు శ్రీనివాసరావు, కిలారు రమణ, కుతుంబాక సీతారామ్, మూడ్ శంకర్, ఏపీవో నాయుడు తదితరులు పాల్గొన్నారు.

మంత్రి పొంగులేటికి వినతి

తిరుమలాయపాలెం,జనవరి23(ఆంధ్రజ్యోతి): గ్రామసభలో అర్హులైన లబ్ధిదారులను గుర్తించి సంక్షేమపథకాలు అందించాలని కోరుతూ సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో గురువారం మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి వినతిపత్రం అందించారు. బుధవారం తిరుమలాయపాలెంలో అర్హులకు పథకాలు రాలేదని అనర్హులకు వచ్చాయిన వీటిపై విచారణ జరిపాలన్నారు. ఈకార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి కొమ్ము శ్రీను, కేస్వామి, వెంకటేష్, కె.రాంబాబు, బి.రాములు, కె.వెంకన్న, రామకృష్ణ, ఏసుబాబు, బిక్షం పాల్గొన్నారు.

రేపు ఎస్సీ వర్గీకరణపై సమావేశం

ఖమ్మంచర్చికాంపౌండ్, జనవరి23(ఆంధ్రజ్యోతి): ఎస్సీవర్గీకరణ వాస్తవాలు.... మాలలపై అసత్య ప్రచారాలపై శనివారం రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్టు మాలమహానాడు ఉమ్మడి ఖమ్మంజిల్లా కన్వీనర్ గుంతేటి వీరభద్రం పేర్కొన్నారు. గురువారం ఖమ్మంనగరంలోని సంఘం కార్యాలయంలో జరిగిన ముఖ్యనాయకుల సమావేశంలో ఈ వివరాలు వెల్లడించారు. ఈసమావేశంలో గౌరవ సలహాదారులు లింగాల రవికుమార్, ఐఎంఎల్‌పీ ప్రధాన కార్యదర్శి మర్రి ప్రకాష్, వరద నర్సింహారావు, కొట్టే సుధాకర్, దాసరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

టీజీవో క్యాలెండర్ ఆవిష్కరణ

ఖమ్మంకలెక్టరేట్, జనవరి23(ఆంధ్రజ్యోతి):తెలంగాణగెజిటెడ్ ఆఫీసర్ల సంఘం క్యాలెండర్‌ను గురువారం రెవెన్యూ శాఖమంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి మోదుగు వేలాద్రి, అసోసియేట్ ప్రెసిడెంట్ వాసిరెడ్డి శ్రీనివాస్, ట్రెజరర్ కొండపల్లి శేషు ప్రసాద్, టీఎన్జీవో హౌజ్ బిల్డింగ్ సొసైటీ కార్యదర్శి డాక్టర్. పి.విజయ్‌కుమార్, జిల్లా ఉపాధ్యక్షులు ఉషశ్రీ, శీలం రామకిషోర్ రెడ్డి, సతీష్, పి.సుధారాణి, వై మంజుల జె.పుష్పరాజ్, కృష్ణవేణి, జహీరుద్దీన్ కె. విజయలక్ష్మి, ఎస్ రాంబాబు పాల్గొన్నారు.

మంత్రి పొంగులేటిని కలిసిన టీఎన్జీవోస్ నూతన కమిటీ



మంత్రి పొంగులేటికి పుష్పగుచ్ఛాన్ని అందిస్తున్న నాయకులు

ఖమ్మంకలెక్టరేట్, జనవరి23 (ఆంధ్రజ్యోతి): మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని గురువారం టీఎన్జీవో నూతన కార్యవర్గ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లాఅధ్యక్ష కార్యదర్శులు గుంటుపల్లి శ్రీనివాసరావు, కొణిదెన శ్రీనివాస్ ఆధ్వర్యంలో మంత్రిని కలిసి పుష్పగుచ్ఛాలను అందించారు.ఉద్యోగులతో స్నేహపూర్వక వాతావరణంలో రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో ముందు ఉంచడానికి ప్రభుత్వానికి ఉద్యోగుల సహకారం అవసరం ఉందన్నారు. మంత్రిని కలిసిన వారిలో జిల్లా అధ్యక్షుడు గుంటుపల్లి శ్రీనివాసరావు, కార్యదర్శి కొణిదెన శ్రీనివాస్, కోశాధికారి వల్లపు వెంకన్న, సహాధ్యక్షులు కొమరగిరి దుర్గాప్రసాద్, జడ్.ఎస్. జైపాల్ విజయ్‌కుమార్, గంగవరపు బాలకృష్ణ, మహిళాధ్యక్షురాలు లలితకుమారి, జాయింట్ సెక్రటరీలు తాళ్లూరి శ్రీకాంత్,బూస చంద్రశేఖర్, ఏలూరి హరికృష్ణ కోనార్, యాకూబ్‌పాషా, జాయింట్ సెక్రటరీ విమెన్ శీలం రాధిక రెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీ పెద్దినేని రాధా కృష్ణ, పబ్లిసిటీ సెక్రటరీ యర్రమల శ్రీనివాస్, నెల్లూరి విజయ తదితరులు పాల్గొన్నారు.



లబ్ధిదారుల ఎంపికపై ప్రజాగ్రహం

బోనకల్, జనవరి23(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిరునోముల, బోనకల్, రావినూతల, రాపల్లి, గోవిందాపురం(ఎ), చొప్పకట్లపాలెం, గోవిందాపురం(ఎల్) గ్రామాల్లో గురువారం గ్రామసభలను నిర్వహించారు. బోనకల్, చిరునోముల గ్రామసభల్లో లబ్ధిదారుల ఎంపిక జాబితా పై ప్రజాగ్రహం వ్యక్తమైంది. అధికారుల నిర్లక్ష్య వైఖరి వలనే తమకు న్యాయం జరగలేదని అసహనం వ్యక్తం చేశారు. బోనకల్‌లో కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకుల మధ్య తీవ్ర వాగ్వాదం నెలకొంది. గ్రామంలో అర్హులైన వారి పరిస్థితి ఏమిటని ప్రశ్నించడంతో వారి నుంచి కూడా మరల దరఖాస్తులు తీసుకోవడంతో ప్రజలు వెనుదిరిగారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి కడారి విజయభాస్కరరెడ్డి, ఎంపీడీవో ఆర్. రమాదేవి, జేఈ నవీన్ కుమార్, కార్యదర్శి కోలా రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

వైకల్యం వెక్కిరించినా...

సమాజ సేవ చేస్తున్న ప్రసాద్

▸ కదలలేని స్థితిలో ఉన్నా ఆధ్యాత్మిక చింతనపై పరిశోధన



ప్రసాద్‌కు భోజనం తినిపిస్తున్న తల్లి

కల్లూరు, జనవరి 23(ఆంధ్రజ్యోతి): ప్రమాదంలో వెన్నుపూస దెబ్బతిని మంచానికే పరిమితమైనా నిరుత్సాహ పడలేదతడు. శరీరంలో స్పర్శ కోల్పోయి 18 ఏళ్లయినా కన్నీరు పెట్టలేదు. విధికి ఎదురీదుతూ మనోధైర్యంతో సమాజ సేవ చేస్తున్నారు కల్లూరు మండలంలోని యజ్ఞనారాయణపురం గ్రామానికి చెందిన సామినేని ప్రసాద్. విద్యావేత్త అయిన ప్రసాద్ 2007లో జరిగిన ప్రమాదంలో అనారోగ్యం బారిన పడ్డారు. కనీసం అన్నం తినటానికి చేతి వేళ్లు కూడా సహకరించని దుస్థితి. ఈ పరిస్థితుల్లో తల్లి హైమావతి, భార్య అరుణ ప్రసాద్‌కు అన్ని విధాలుగా చిన్నపిల్లవాడిని లాలించినట్లుగా సపరి చర్యలు చేస్తూ ఆయనలో ధైర్యం నింపారు.

ఆధ్యాత్మిక, సేవా కార్యక్రమాలు..

మంచానికే పరిమితమైన తనను పరామర్శించటానికి వచ్చిన వారి మాటలు ప్రసాద్‌లో అధ్యాత్మిక పరిశోధన చేసేలా పురికొల్పాయి. వేదాలు, ఉపనిషత్తులను, రామాయణం, మహాభారతం, భాగవతం, భగవద్గీత, పురాణాలు, బ్రహ్మ సూత్రాలను సమగ్రంగా పరిశోధించారు. అంతటితో సంతృప్తిచెందిన ప్రసాద్ సామాజిక సేవ కార్యక్రమాలపై దృష్టి నిలిపాడు. మిత్రులతో ఒక వాట్సాప్ గ్రూపు ఏర్పాటు చేశారు. 'భవిష్యనిధి' అనే పేరుతో విరాళాలు సేకరించారు. స్నేహితుల సహకారంతో 30 మందికి వీల్ చైర్స్ ఇప్పించారు. హోప్-4 స్పందన అనే అమెరికా సేవా సంస్థను యూరిన్ బ్యాగు, యూరిన్ క్యాథెటర్, కాటన్ రోల్ డైపర్స్, డెటాల్ బెడ్ సోర్స్ తగ్గించటం కోసం ఒక మెడికల్ కిట్ రూపంలో ఇవ్వాలని అభ్యర్థించారు. తద్వారా 100 మందికి రూ.2 వేల విలువ గల మెడికల్ కిట్లును అందించే ఏర్పాటు చేశారు. మెరిట్ విద్యార్థులకు తన మిత్రుడైన బండి నాగేశ్వరరావు సహకారంతో ఎన్నారై సంస్థ ద్వారా ఫౌండేషన్ నుంచి లాప్‌టాప్‌లు ఇప్పించారు. యజ్ఞనారాయణపురంలో కుళాయిలు వదిలే సమయం తెలిసేలా సైరన్ ఏర్పాటు చేశారు. తన తాత జ్ఞాపకార్థం కుటుంబ సభ్యులతో కలిసి గ్రామంలో సిమెంట్ బెంచ్‌లు ఏర్పాటు చేశారు.



కల్లూరులో కేక్ కట్ చేస్తున్న టీడీపీ నాయకులు

ఘనంగా నారా లోకేష్ జన్మదిన వేడుకలు

కల్లూరు/ ఏన్కూరు, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): కల్లూరు పట్టణంలో గురువారం టీడీపీ ఆధ్వర్యంలో ఘనంగా ఏపీ మంత్రి నారా లోకేష్ జన్మదిన వేడుకలను జరుపుకొన్నారు. ఈ సందర్భంగా మెయిన్ సెంటర్‌లో టీడీపీ సీనియర్ నాయకులు జాస్తి శ్రీనువాసరావు, మాజీ ఎంపీటీసీ పొట్రు శ్రీనువాసరావు కేక్ కట్ చేశారు. అనంతరం టీడీపీ నాయకులు, అభిమానులు పరస్పరం శుభాకాంక్షలు తెలిపారు. తెలుగు యువత ఏన్కూరు మండల అధ్యక్షుడు యల్లంపల్లి వేణు ఆధ్వర్యంలో టీడీపీ మాజీ ఎంపీపీ ఆరెం వరలక్ష్మి, జడ్పీటీసీ మాజీ సభ్యురాలు మాజీ కోపెల శ్యామల కేక్‌కట్ చేసి సంబురాలు జరుపుకొన్నారు. విద్యార్థులకు, వృద్ధులకు పులిహోర పంచి పెట్టారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కట్టా గోపాలరావు, ఏదుళ్ల నాగేశ్వరరావు, కె గురవయ్య , ఏన్కూరు మండల పార్టీ అధ్యక్షుడు కొనకంచి రామకృష్ణ, కమ్మ సంఘం అధ్యక్షుడు తోట రాధాకృష్ణ, పార్టీ సీనియర్ నాయకుడు ఆరెం రామయ్య, గాదే శేషయ్య, స్వర్ణకోటి, రామారావుపాల్గొన్నారు.



సత్తుపల్లిలో దరఖాస్తుల స్వీకరిస్తున్న అధికారులు



వేంసూరు గ్రామసభలో పాల్గొన్న అదనపు కలెక్టర్ శ్రీజ



కొణిజర్లలో అధికారులను ప్రశ్నిస్తున్న ప్రజలు

ముగిసిన గ్రామసభలు

▸ ఇందిరమ్మ ఇళ్లకు దరఖాస్తుల స్వీకరణ ▸ అర్హులను ఎంపిక చేయాలని ప్రజల డిమాండ్

సత్తుపల్లిరూరల్/ వేంసూరు, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): మూడో రోజు గురువారం నిర్వహించిన ప్రజాపాలన-గ్రామ,వార్డు సభలు ప్రశాంతంగా ముగిశాయి. పట్టణంలో 4,189, మండలంలో 6,132 దరఖాస్తులు స్వీకరించినట్లు మునిసిపల్ కమిషనర్ మందా రవిబాబు, ఎంపీడీవో ఆర్‌సీహెచ్ నాగేశ్వరరావు తెలిపారు. మొదటి రోజు సభలలో జాబితాలోని అర్హుల పేర్లు ప్రకటించడంతో అర్హుల పేర్లు చేర్చలేదని, అనర్హులను పథకాలలో చేర్చారంటూ ఆందోళనలు చేయగా మూడవ రోజు మాత్రం సభా వేదిక వద్ద జాబితాను ప్రకటించకపోవడంతో ఎక్కడా ఆందోళనలు చోటుచేసుకోలేదు. అయితే ఉపాధి హామీ పథకంతో పాటు ఇందిరమ్మ ఇళ్ల పథకంలో అర్హులను చేర్చలేదనే వాదన అన్నివార్డులు, గ్రామాలలో ఉండగా ఇది తుది జాబితా కాదని, మళ్లీ దరఖాస్తులు పెట్టుకోవాలని అధికారులు సూచించడంతో ప్రజలు చేసేదేమీలేక నిరుత్సాహానికి గురవుతున్నారు. మూడు రోజుల పాటు సత్తుపల్లి మునిసిపాలిటీతో రేషన్ కార్డుల కోసం 1,571 ఇందిరమ్మ ఇళ్ల కోసం 2,018 రేషన్‌కార్డుల్లో పేర్ల నమోదుకు 572 రైతు భరోసాకు 28, మొత్తం 4,189 దరఖాస్తులు దాఖలయ్యాయి. సత్తుపల్లి మండలంలో మూడు రోజులుగా రేషన్‌కార్డుల కోసం 2,480, ఆత్మీయ భరోసా కు 852, రైతు భరోసాకు 235, ఇందిరమ్మ ఇళ్లకు 2,565, మొత్తం 6,132 దరఖాస్తులు దాఖలయ్యాయి.



రేజర్లలో మాట్లాడుతున్న మట్టా దయానంద్

అధికారుల నిలదీత

కొణిజర్ల/ కారేపల్లి, జనవరి23(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ఏర్పాటు చేసిన నాలుగు పథకాలకు సంబంధించి నిర్వహిస్తున్న గ్రామ సభలు గురువారంతో ముగిశాయి. ప్రతి గ్రామసభలో ఇందిరమ్మ ఇండ్లు, ఇందిరమ్మ ఆత్మీయభరోసా, రేషన్‌కార్డులకు సంబంధించి అర్హులను గుర్తించలేదని ప్రజలు అధికారులను నిలదీశారు. మొత్తం అర్హులకంటే అనర్హుల పేర్లే ఉన్నాయని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు.

అనర్హుల పేర్లు రావడంపై ఆగ్రహం

రాష్ట్ర ప్రభుత్వం అమలుచేయనున్న నాలుగు పథకాలకు సంబంధించి బుధవారం వేంసూరు మండలంలోని వెంకటాపురం, చిన్నమల్లెల, వేంసూరు, పల్లెవాడ, కల్లూరుగూడెం, శంభునిగూడెం, జయలక్ష్మీపురం గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించారు. అనర్హుల పేర్లు రావడంతో అర్హులు ఆగ్రహం వ్యక్తం చేశారు. చిన్నమల్లెల గ్రామ సభలో అదనపు కలెక్టర్ శ్రీజ పాల్గొన్నారు.



కల్లూరులో డేటా ఎంట్రీని పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్ శ్రీజ

డేటా ఎంట్రీ ప్రారంభం

కల్లూరు, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): కల్లూరు మండల పరిషత్, తహసీల్దార్ కార్యాలయాల్లో నాలుగు పథకాలపై గ్రామ సభల్లో అందిన దరఖాస్తులపై గురువారం డేటా ఎంట్రీ ప్రారంభించారు. అడిషనల్ కలెక్టర్ శ్రీజ, కల్లూరు ఆర్డీఓ రాజేంద్రగౌడ్‌లు సందర్శించి పరిశీలించారు. గ్రామ సభల్లో అందిన దరఖాస్తులను సక్రమంగా పరిశీలించి వాటిని ఆన్‌లైన్‌లో ఎలాంటి తప్పులు దొర్లకుండ నమోదు చేయాలని సూచించారు.

కాంగ్రెస్, బీఆర్ఎస్ వర్గాల మధ్య ఘర్షణ

పెనుబల్లి, జనవరి 23(ఆంధ్రజ్యోతి): వీఎంబంజర్ గ్రామపంచాయతీ ప్రత్యేక అధికారి అన్నపూర్ణ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన గ్రామసభలో కాంగ్రెస్, బీఆర్ఎస్ వర్గాల మధ్య ఘర్షణ జరిగింది. పంచాయతీ కార్యదర్శి ఇందిరమ్మ ఆత్మీయ భరోసాలో అనర్హులను అర్హులుగా ప్రకటించారని అర్హులైన వారి పేర్లు ఎందుకు రాలేదని ఇరువర్గాలు ఘర్షణకు దిగాయి. అనంతరం వామపక్ష నాయకులు కల్పించుకొని ఇరువర్గాలను శాంతింపజేశారు. ఆతర్వాత గ్రామసభ సజావుగా సాగింది.

'వితంతువులు, దివ్యాంగులకు ప్రాధాన్యనివ్వాలి'



గ్రామసభలో పాల్గొన్న సీపీఎం నాయకులు

వైరా, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు, ఆత్మీయ భరోసాలో వితంతువులు, దివ్యాంగులు, గుడిసె వాసులకు ప్రాధాన్యనివ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బొంతు రాంబాబు, సీనియర్ నాయకుడు పారుపల్లి కృష్ణారావు డిమాండ్ చేశారు. గురువారం వైరా మండలం విప్పలమడక గ్రామసభలో వారు మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్క కుటుంబానికి సంక్షేమ పథకాలు అందించాలన్నారు. అర్హులైన వారు రేషన్‌కార్డులు లేక ఉచిత విద్యుత్, గ్యాస్ సబ్సిడీ పొందలేకపోతున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి బాణాల శ్రీనివాసరావు, తోట నాగేశ్వరరావు, మాజీ సర్పంచ్ తుమ్మల జాన్‌పాపయ్య పాల్గొన్నారు.

నిరంతర ప్రక్రియగా పథకాలు

▸ మునిసిపల్ కమిషనర్ సంపత్‌కుమార్

మధిరటౌన్, జనవరి23 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పథకాలు నిరంతర ప్రక్రియగా కొనసాగుతాయని, వార్డు సభలో తెలిపిన జాబితాలో తమ పేర్లు లేవని ఎవరూ బాధపడాల్సిన పనిలేదని మధిర మునిసిపల్ కమిషనర్ సంపత్‌కుమార్ అన్నారు. గురువారం మధిర మునిసిపాలిటీ లో జరిగిన వార్డు సభల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. అర్హుల జాబితాలో తమ పేరు లేకపోయినా ఎవరు బాధపడవద్దు అని రేషన్ కార్డు, ఇందిరమ్మ ఇళ్ల తో పాటు ప్రభుత్వ పథకాలకు దరఖాస్తులు తీసుకునే ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని తెలిపారు. జాబితాలో పేరు లేనివారు దరఖాస్తు చేసుకోవచ్చని వారికి అర్హత ప్రకారం పథకాలు మంజూరు చేయడం జరుగుతుందని తెలిపారు. మూడు రోజులుగా సాగిన వార్డు సభలు నేటితో ముగియగా మధిర మునిసిపాలిటీలో వార్డు సభల్లో రేషన్ కార్డులు కోసం 1 ,454 మంది, ఇందిరమ్మ ఇళ్ల కోసం 1, 423 మంది కొత్తగా దరఖాస్తు చేసుకున్నారు. అన్ని వార్డుల్లో వార్డు సభలు ప్రశాంతంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో మేనేజర్ ఉదయ్‌కుమార్ పాల్గొన్నారు.



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న డీపీవో ఆశాలత

మధ్యాహ్నభోజనాన్ని పరిశీలించిన డీపీవో

మధిర రూరల్, 23 (ఆంధ్రజ్యోతి): మధిర మండలం సిరిపురం గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను గురువారం జిల్లా పంచాయతీ అధికారి ఆశాలత సందర్శించారు. విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్నబోజనాన్ని పరిశీలించి భోజనం చేశారు.అనంతరం ఆమె మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి పదో తరగతిలో మంచి ఫలితాలు సాధించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటేశ్వర్లు, ఎంపీవో శాస్త్రీ, హెచ్ఎం మురళీమోహన్ పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నతస్థాయికి ఎదగాలి

▸ బత్తినేని చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ నాగప్రసాదరావు



బ్యాగులను పంపిణీ చేస్తున్న దాత నాగప్రసాదరావు

బోనకల్, జనవరి 23(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నతస్థాయికి ఎదగాలని బత్తినేని చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ బత్తినేని నాగప్రసాదరావు సూచించారు. మండలంలోని నారాయణపురం, చిన్నబీరవల్లి ప్రాథమిక పాఠశాలల్లో గురువారం బత్తినేని చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో విద్యార్థులకు స్కూల్ బ్యాగులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన మనవడు రేయాన్ పొదుపు చేసిన నగదుతో పిల్లలకు బ్యాగులను పంపిణీ చేశామని తెలిపారు. విద్యార్థులు సేవాభావాన్ని అలవరుచుకోవాలని కోరారు. అనంతరం దాతలను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో దామాల పుల్లయ్య, ఎన్ఆర్ఐ బత్తినేని లలిత, కాంప్లెక్స్ హెచ్ఎం శ్రీనివాసరావు, పోతినేని నర్సింహరావు, సూర్యదేవర సుధాకర్, దొంతెబోయిన రమేష్ తదితరులు పాల్గొన్నారు.

అంకితభావంతో పని చేస్తున్నాం

నారాయణపురం సొసైటీని మరింత బలోపేతం చేసేందుకు గానూ అంకితబావంతో పని చేస్తున్నామని చైర్మన్ బత్తినేని నాగప్రసాదరావు తెలిపారు. సొసైటీ కార్యాలయంలో సంఘ నూతన క్యాలెండర్లను ఎన్ఆర్ఐ బత్తినేని లలిత, రేయాన్‌లతో కలిసి ఆవిష్కరించారు. సొసైటీ కోసం రూ. 30లక్షల సొంత నిధులతో స్థలాన్ని కొనుగోలు చేశానని, రైతులంతా సొసైటీ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రైతులకు సరిపడ ఎరువులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఈవో వెంకటేశ్వర్లు, డైరెక్టర్లు నర్సింహరావు, వెంకటేశ్వర్లు, సుధాకర్ పాల్గొన్నారు.

కుటుంబ సర్వే సిబ్బందికి

పారితోషికం వెంటనే చెల్లించాలి

▸ పీఆర్‌టీయూ జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు బ్రహ్మారెడ్డి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఉపాధ్యాయులు

మధిర, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): కుటుంబ సర్వేలో పాల్గొన్న సిబ్బందికి వెంటనే పారితోషికం చెల్లించాలని పీఆర్‌టీయూ జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు ఆర్. బ్రహ్మారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈమేరకు గురువారం సాయంత్రం తహసీల్దార్ రాంబాబుకు ఉపాధ్యాయులతో కలిసి వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వేచేసి రెండు నెలలు అయినా సర్వేలో పాల్గొన్న ఉపాధ్యాయులు, ఇతర ఉద్యోగులకు రెమ్యూనరేషన్ ఇవ్వకపోవడాన్ని ప్రశ్నించారు. సర్వేలో పాల్గొన్న ప్రతి ఒక్కరికి పది వేల రూపాయలుఇస్తామని అప్పుడే అందరివద్ద నుంచి బ్యాంక్ అకౌంట్ నెంబర్లు తీసుకున్నారని, కాని రెండు నెలలు అయినా ఇంతవరకు చెల్లించకపోవడం శోచనీయమన్నారు. కొన్ని జిల్లాల్లో పారితోషికం ఇచ్చారని, నవంబరు నెలలో ఉపాధ్యాయులు ఉదయం, రాత్రి పని చేసి ప్రభుత్వం అప్పగించిన సర్వే బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించారని తెలిపారు. సెలవు రోజుల్లోనూ పనిచేశారని ఆసెలవు రోజులకు 5సీసీఎల్ ను మంజూరు చేయాలని కోరారు. ఈకార్యక్రమంలో పీఆర్‌ఈయూ సంఘం రాష్ట్ర బాధ్యులు షేక్ మదార్, పిల్లి నర్సింహారావు, ఎల్ అప్పారావు, మల్లెల శ్రీనివాస్, చేడే సతీష్ పాల్గొన్నారు.



శంకుస్థాపన చేస్తున్న దుర్గాప్రసాద్

సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన

చింతకాని, జనవరి 23(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని నాగులవంచ గ్రామంలో రూ.12 లక్షలతో నిర్మాణం చేయనున్న సీసీ రోడ్లకు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ గురువారం శంకుస్థాపన చేశారు. గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు అంబటి వెంకటేశ్వర్లు, మడుపల్లి భాస్కర్‌గౌడ్, తేలుకుంట్ల శ్రీనివాస్, కంచుమర్తి రామకృష్ణ, నారపోగు కొండల్‌రావు, సట్టు వెంకటేశ్వర్లు, ఏటుకూరి రవి, ముత్తినేని వెంకటేశ్వర్లు, ఆలస్యం రవి పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

సత్తుపల్లిరూరల్, జనవరి 23(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ద్వారకాపూరి కాలనీ రోడ్ నెం.7లో నిర్మితమవుతున్న శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి రూ.10,116 విరాళాన్ని గురువారం దాతలు అందజేశారు. ఈ సందర్భంగా దాతలు జేవీఆర్ ఓసీ పీవో ఎన్‌వీ ప్రహ్లాద్, ఉషశ్రీ దంపతులును స్వామివారి శేషవస్త్రాలతో సన్మానించినట్లు నిర్వాహకులు తెలిపారు.

నేతాజీ సుభాష్ చంద్రబోస్

అందరికీ ఆదర్శం

▸ కాంగ్రెస్ నాయకుడు మట్టా దయానంద్



నేతాజీ విగ్రహానికి పూలమాల వేస్తున్న దయానంద్

సత్తుపల్లి, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): 'మీ రక్తాన్ని ఇవ్వండి.. నేను మీకు స్వాతంత్ర్యం ఇస్తానని ' తన మాటలతో ఉర్రూతలూగించిన నేతాజీ మనందరికీ ఆదర్శమని కాంగ్రెస్ పార్టీ నాయకుడు డాక్టర్ మట్టా దయానంద్ అన్నారు. నేతాజీ జయంతి సందర్భంగా సత్తుపల్లి రింగ్‌సెంటర్‌లోని ఆయన కాంస్య విగ్రహానికి పూలమాల వేసి ఘననివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత దేశం కోసం పోరాడిన మహనీయుల గురించి తెలుసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థులకు రాగి జావ పంపిణీ



ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జావ పంపిణీ చేస్తున్న ప్రిన్సిపాల్

కారేపల్లి, జనవరి23 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రభుత్వజూనియర్ కళాశాల విద్యార్థులకు గురువారం రాగిజావ పంపిణీ చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఆయన జావను ప్రిన్సిపాల్ ఎస్.విజయకుమారి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. విద్యార్థులకు ఎంతోఉపయోగపడే రాగిజావ పంపిణీ ఈ ఏడాది వార్షిక పరీక్షల వరకు కొనసాగుతుందన్నారు. ఈకార్యక్రమంలో అధ్యాపకులు, అధ్యాపకేతరులు, సిబ్బంది పాల్గొన్నారు.

అండర్ బ్రిడ్జి గుండా రాకపోకలు బంద్



దారిని మూసివేసిన దృశ్యం

మధిరటౌన్, జనవరి23(ఆంధ్రజ్యోతి): మధిర పట్టణంలో లడకబజార్ వైపునకు వచ్చే రైల్వే అండర్ బ్రిడ్జి గుండా రైల్వే అధికారులు రాకపోకలను గురువారం నుండి నిలిపి వేశారు. మధిర పట్టణంలో మూడో రైల్వే లైన్ నిర్మాణ పనులు కొనసాగుతుండగా ఇక్కడ మూడో లైన్ కోసం మరో అండర్ బ్రిడ్జి నిర్మాణం చేయవలసి ఉండగా రైల్వే అధికారులు అటువైపు వాహనాలు రాకుండా బారికేడ్‌లు పెట్టి రాకపోకలను బంద్ చేశారు. మధిర వన్‌టౌన్ నుంచి టూటౌన్ కు రావలసిన వారు రైల్వే ఓవర్ బ్రిడ్జీ గుండా తమ రాకపోకలు సాగించాలని కోరారు.

108 వాహనం తనిఖీ



తనిఖీ చేస్తున్న జిల్లా కోఆర్డినేటర్

పెనుబల్లి, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): పెనుబల్లిలోని 108వాహనా.న్ని జిల్లా కోఆర్డినేటర్ దుర్గాప్రసాద్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అంబులెన్స్‌లోని పరికరాల పనితీరు, స్టాక్‌ను పరిశీలించారు. అన్నీ సక్రమంగానే ఉన్నాయని సంతృప్తి వ్యక్తం చేశారు. ఈఎంటీ బి.రమేష్, పైలెట్ జె.రమేష్ పాల్గొన్నారు.